vivekasamayam2018@gmail.com

TELTEL/2021/80389

# వివేక సమయం

తెలుగు దినపత్రిక

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్

VIVEKA SAMAYAM

వరంగల్ సంపుటి :5 సంచిక : 90 మంగళవారం 14 ఏప్రిల్ 2026 పేజీలు : 8 వెల : 5-00 Postal Rigistration No.HNK - 50/RNP/2024-2026

https://epaper.vivekasamayam.com/ ఎడిటర్ : డాక్టర్ వక్కల వెంకట స్వామి Cell No: 9502203214




- ఇందులో బిజెపి రాజకీయ కుట్ర దాగి ఉంది
- పునర్విభజనను రాజకీయ పావుగా వాడుకుంటున్న మోడీ
- జనాభా లెక్కల అనంతరం మహిళా బిల్లు అని చెప్పారు
- ఆ మేరకే గతంలో బిల్లు పెట్టి..ఇప్పుడీ హడావిడి ఎందుకు?
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై అనుమానాలు ఉన్నాయి
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

## మహిళా రిజర్వేషన్లతో

# పునర్విభజన లింక్

- 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి
- జనాభా లెక్కల తరవాత నియోజకవర్గాల పునర్విభజనపై చర్చించాలి
- దక్షిణాదిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఉత్తరాది సీట్ల పెంపు
- 50శాతం సీట్ల పెంపు ఏ ప్రాతిపదకనో ఎందుకు చెప్పడం లేదు

హైదరాబాద్,వివేక సమయం

మహిళారిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంతో రాజకీయ కుట్ర ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2026 జనాభా లెక్కల ప్రకారంమహిళారిజర్వేషన్లబిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు కట్టుబడి ఉంటామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. హిళలరాజకీయసాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టుబడి ఉంది..నియోజకవర్గాల పునర్వభజనను ప్రధాని మోదీ రాజకీయ పావుగా ప్రమాదకరంగా వాడుకుంటున్నాడని ఆరోపించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాజకీయ పార్టీలకో, ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని స్పష్టం చేసిన సీఎం రేవంత్, దీనిని మహిళా రిజర్వేషన్లతో కలిపి చూపించడం సరైంది కాదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను కలిపి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని విమర్శించారు. సోమవారం సాయంత్రం

మిగతా 2లో

# అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు

- వికలాంగులకు ట్రై సైకిళ్లు
- మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ
- ఫోన్ల కొనుగోళ్లలో అక్రమాలు లేవన్న తుమ్మల




ఖమ్మంవివేక సమయం: సంక్షేమ పథకాల అమలు, మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ముందడుగు వేసింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు, వికలాంగులకు ట్రై సైకిళ్లు, మహిళలకు

- మిగతా 2లో పేజిలో

## సోలార్ రూఫ్ టాప్ యూనిట్లతో అందరికీ ఉపయోగం



- ఛార్జీలు తగ్గాలంటే పునరుత్పాదక విద్యుత్తే ప్రత్యామ్నాయం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్




## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

- క్రూడాయిల్ బ్యారెల్ ధర 103 డాలర్లకు చేరిక
- భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

2లో

# మహిళా కోటాతో

## డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దు

- మహిళా కోటాను వెంటనే అమలు చేయండి
- డీ లిమిటేషన్‌పై సమిష్టిగా చర్చించాల్సిందే
- ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి సూచన



హైదరాబాద్,వివేక సమయంఅసెంబ్లీ సీట్లలో మహిళా కోటా వెంటనే అమలు చేయాలని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ పేరుతో డీలిమిటేషన్‌ని ముందుకు తేవొద్దని సూచించారు. డీలిమిటేషన్‌పై కేంద్రం తీరు సరైనది కాదని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్, లోక్‌సభ డీలిమిటేషన్ వేర్వేరు అంశాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రస్తావించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ పెట్టారు. జనాభా ఆధారిత డీలిమిటేషన్‌పై ఆందోళనలు చేయొద్దని అన్నారు.

మిగతా 2లో

## రాష్ట్రపతిని కలిసిన లోకేశ్ బృందం



న్యూఢిల్లీ,వివేక సమయం

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఎపి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది.

అమరావతి బిల్లు అమల్లోకి రావడంతో ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు ముర్ముతో భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు. అమరావతి రాజధాని ప్రజల కల అన్నారు. ఇందుకోసం రైతులు 33 వేల ఎకరా లు ఉదారంగా ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని వివరించారు.

# మహిళలంటే బిజెపికి చిన్నచూపు

- 15మంది బిజెపి అద్యక్షులు మారినా..మహిళలకు చోటేది
- ముఖ్య పదవుల్లో కూడా మహిళలకు చోటివ్వని బిజెపి
- కాంగ్రెస్‌లో ఇందిర, సోనియాలు అధ్యక్షులుగా పనిచేశారు
- బండి సంజయ్ విమర్శలు మాని నిజాలు తెలుసుకోవాలి
- మీడియా సమవేశంలో సిఎం రేవంత్ రెడ్డి చురకలు




హైదరాబాద్,వివేక సమయం

సీట్ల పునర్విభజనలో పర్సంటేజీలు కాదు నెంబర్ ముఖ్యం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో నెంబర్ ముఖ్యం అంటూ.. వాజపేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో పడిపోయిందని గుర్తు చేశారు. నెంబర్ లేకుండా రాజకీయాల్లో ఎవరూ ఎవరితోనూ చర్చలు చేయరని అన్నారు. ఇకపోతే ఇప్పటివరకు15 మంది బీజేపీ అధ్యక్షుల నియామకం జరిగింది.. కాని ఇప్పటివరకు భారతీయజనతా పార్టీ అధ్యక్షురాలి గా ఒక్క మహిళ నియామకంజరగలేదని సిఎం రేవంత్ చురకలంటించారు. బీజేపీకి మహిళ పట్లగౌరవం, చిత్తశుద్ధి ఉందో అర్థమౌతుందన్నారు. ఇందిరాగాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో అతి ఎక్కువ కాలం పనిచేసిన పార్టీ కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేస్తుందా.. అని ప్రశ్నించారు. బీజేపీకి మహిళను అధ్యక్షురాలిగా నియమించుకున్న తర్వాత బండి సంజయ్ మాట్లాడాలన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలుదక్షణాది రాష్ట్రాల్లోని ఎస్సీ,ఎస్టీ, మహిళలకు వ్యతిరేకం.. అన్నారు. మా ఎంపీలు తెలంగాణను సాధించారు.. ఇప్పుడు పునర్విభజన పైన కూడా పోరాడుతారని సిఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలను

మిగతా 2లో




వివరాలు 2లో

# ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు

- ఢిల్లీ హైకోర్టులో విచారణ
- దర్యాప్తు సంస్థల తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్



సంపాదకీయం




# అంబేడ్కర్ ఆశయాలకు పట్టం కట్టాలి !

అంబేద్కర్ మహాశయుడు ఈ దేశం గురించి గొప్పగా కలలు కన్నారు. తన దేశాన్ని ఉన్నతంగా చూడాలను కున్నారు. అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించడంతో పాటు, అందరికీ విద్య దక్కాలన్న ఆశయం ఆయనది. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమ న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సార్వభౌమాధి కారాన్ని దక్కించుకొనేందుకు వీలుగా అంబేద్కర్ రాజ్యంగాన్ని రూపొందించారు. వివిధ రకాల భాషలు, ఆచారాలు, మతాలూ ఉన్నటువంటి ఈ దేశంలో ఆయన ముందు చూపుతో రాసిన రాజ్యాంగం అనుసరించి ఇప్పుడు మన దేశం నడుస్తుంది అంటే ఆయన గొప్పతనం ఏంటో అర్థం అవుతుంది. ఆయన కేవలం దళితుల కోసమో లేక వాళ్ళ రిజర్వేషన్ ల కోసమో మాత్రమే కృషి చేయలేదు. ఆడవాళ్ళకి మగవాళ్ళకి సమానమైన జీతాలు ఉండాలని, ఆడవాళ్ళకి ప్రెగ్నెన్సీ టైం లో లీవ్స్ ఇవ్వాలని, పని గంటల సమయాన్ని 12 నుండి 8 గంటలు చేయాలనీ, స్త్రీలకూ ఆస్తి హక్కు ఇవ్వాలని ఇలా ఎన్నో అంశాలలో ఈయన కృషి చేసారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని యావత్ భారతావని ఆయన ఆశయాలపై ఇప్పటికైనా అధ్యయనం చేయాలి. ఎంతసేపు అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహాలు పెట్టడం, సభలు పెట్టడం కాదు. ఆయన దేశానికి అందించిన విలువైన సూచనలు పాటించలి. ఆయన కోరుకున్న సమాజం కోసం పాలకులు ఆలోచన చేయాలి. అందుకు నడుం బిగించాలి. జయంతి సభల్లో ఉపన్యాసాలు ఇవ్వడం మానాలి. ఒకానొక సమయంలో అంటరానితనం పేరు తో అట్టడుగు వర్గాల ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉండేదన్నది ఆయన జీవితమే పెద్ద ఉదాహరణ. అప్పటి వరకు మూగ బోయిన అణగారిన ప్రజలకు గొంతుకయ్యాడు. అయితే కొందరు రాజకీయంగా ఆయనను ఎదగకుండా చేశారు. స్వాతంత్ర్యం రాగానే నెహ్రూ బదులు అండేబ్కర్‌ను ప్రధానిని చేసివుంటే మనదేశ రాత మరోలా ఉండేది. కానీ నెహ్రూ, గాంధీల కుట్రలకు ఆయన బలయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆర్థిక నిపుణుడు, దళితో ద్ధారకుడు, మహా మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇలా ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే నేమో ఆయనను ఆనాటి నేతలు దూరం పెట్టారు. ఈనాటి నేతలు విగ్రహాలు పెట్టి, కేవలం చెక్క భజనలు చేస్తున్నారు. కానీ ఆయన స్వప్నించిన భారతాన్ని ఆవిష్కృతం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీన రాంజీ మాలోజి సక్పాల్ ,భీమాబాయ్ దంపతులకు మధ్యప్రదేశ్ లోని మావ్ గ్రామంలో మహర్ కులంలో అంబేద్కర్ జన్మించారు. అప్పట్లో ఈ కులం వారిని అంటరానివారిగా పరిగణిం చేవారు. దళితుడు అనే కారణంతో ఈయన చిన్న వయసు నుండే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. చిన్నప్పుడు వాళ్ళ అన్నయ్యతో కలిసి వేరే ఊరుకి నడిచి వెళ్తుంటే బాగా దాహం వేయడంతో దగ్గరలో ఉన్న ఒక ఇంటికి వెళ్లి తాగడానికి నీటిని అడిగితే అంబేద్కర్ మహర్ కులానికి చెందిన వారు అని తెలిసి నీళ్లు ఇవ్వకపోగా, పక్కనే ఉన్న మురికి గుంటలో నీటిని తాగమని తిట్టి పంపించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి అనేక అవమానాలను అంబేద్కర్ ఎదుర్కొన్నారు. అందుకే ఇలాంటి వ్యవస్తను నిరసించాడు. అలాగని మిగతా కులాల వారిని ఏనాడూ ఆయన ఈసడించుకోలేదు. ఇది వ్యవస్థాగతమైన లోపంగా గుర్తించారు. తన ఆలోచనలను రాజ్యాంగ రచనలో చూపారు. భారత దేశం ఉన్నతంగా ఉండాని కోరుకున్నాడు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పారు. కానీ వారెవ్వరూ అంబేద్కర్‌ను లెక్కచేయలేదంటే, ఆయన పట్ల వారికి గల ప్రేమానురాగాలు ఏపాటివో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. అమెరికాలో మొదటి సారిగా అంబేద్కర్ స్వేచ్ఛ అంటే ఏంటో చూసారు. అప్పుడు భారత దేశంలో ఉన్నట్టుగా కుల, జాతి వివక్షత లేదు. అందరికి సమానమైన గౌరవం, అవకాశాలు దక్కేవి. 1917 లో అంబేద్కర్ వెనక్కి వచ్చి ఒప్పందం ప్రకారం బరోడా సంస్థానంలో రక్షణశాఖలో ఉద్యోగంలో చేరారు.క్కడ ఆయనకి ఒక గొప్ప అధికారిగా ఉద్యోగం దక్కింది కానీ ఈయన నిమ్న కులస్తుడు కావడంతో ఆయన కింద ఉండే ఉద్యోగులు కూడా ఆయనని గౌరవించే వారు కాదు. ఏదైనా ఒక ఫైల్ ఇవ్వాలంటే దూరం నుండే ఆయన టేబుల్ మీదకు విసిరేసేవారు. చదవాలన్న, పని చేయాలన్న, ఉండడానికి ఇల్లు కావాలన్నా, చివరికి నీళ్లు తాగాలన్న కూడా కులం అడ్డు వచ్చేది. ఉద్యోగం చేసుకుంటూనే 1927 నుండి అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం మొదలు పెట్టాడు. ఇలా మహద్ లో దళితుల మహా సభని ఏర్పాటు చేసారు. దేశంలో నలుమూలల నుండి కొన్ని వేళ మంది దళితులు ఆ సభకు హాజరయ్యారు. అప్పటివరకు దళితులు మహద్ లోని చెరువులో నీటిని తాగడానికి అనుమతి ఉండేది కాదు.

# మరోమారు ఎదురు కాల్పులు

మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి
అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్

రాయ్‌పూర్,ఏప్రిల్13 ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు కమాండర్ రూపీ మృతి చెందారు. కాంకేర్ జిల్లాలోని ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రూపీపై రూ.5 లక్షల బహుమతి ప్రకటించబడినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా, ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి.ఎన్‌కౌంటర్ అనంతరం రూపీ మృతదేహంతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో మరికొందరు మావోయిస్టులు దాగి ఉన్నారనే అనుమానంతో విస్తృతంగా గాలింపు కొనసాగుతోంది. గత నెలలో కూడా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే. ఎన్‌కౌంటర్ సమయంలో సుమారు పదిమంది మావోయిస్టులు అక్కడి నుంచి అడవుల్లోకి పారిపోయినట్లు సమాచారం. వారు దట్టమైన అటవీ ప్రాంతాన్ని ఉపయోగించి తప్పించుకున్నారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. వారిని గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగాయి. ఎన్‌కౌంటర్ అనంతరం ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. మరి కొంతమంది మావోయిస్టులు అటవీలో దాగి ఉండవచ్చనే అనుమానంతో ఆపరేషన్‌ను భద్రతా బలగాలు కొనసాగిస్తున్నాయి. మావోయిస్టుల కదలికలపై గత కొంతకాలంగా భద్రతా బలగాలు నిఘా పెంచాయి. వారికి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్‌ని చేపట్టినట్లు తెలుస్తోంది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ఆపరేషన్ జాగ్రత్తగా కొనసాగుతోంది. ఈ ప్రాంతం గతంలో కూడా మావోయిస్టు కార్యకలా పాలకు కేంద్రంగా ఉంది. తరచూ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరుగుతు న్నాయి. మావోయిస్టులు ఉద్యమం ప్రభావం ఈ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతోండటంతో భద్రతా సవాళ్లు నెలకొన్నాయి. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సమీప గ్రామాల్లో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటవీ ప్రాంతానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన మరికొంతమంది మావోయిస్టులను పట్టుకోవడానికి డ్రోన్ సర్వైలెన్స్, ప్రత్యేక కూంబింగ్ బలగాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఈ ఆపరేషన్ మరికొన్ని గంటలు లేదా రోజులు కొనసాగవచ్చని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. మాచపల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందడం, పలువురు తప్పించుకోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్‌లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయిల్ సమాలోచనలు
ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన

వాషింగ్టన్,ఏప్రిల్13 అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించే ందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది.


హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు ఇరాన్‌పై పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ దాడులకు ట్రంప్ అంగీకరిస్తారా? లేదా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇరాన్ (ఎసజీని)ను నలువైపులా నిర్బంధించి, హర్మూజ్ జలసంధిపై నియంత్రణ తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మిత్ర దేశాలతో కలిసి ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు భద్రత కల్పించే అంశంపై అమెరికా అధ్యక్షుడు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా ఇరాన్‌పై దాడులు సిద్ధమవు తున్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణ విషయంలో ట్రంప్ నిర్ణయం కోసం ఇజ్రాయెల్ ఎదురుచూస్తున్నట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే, ఈలోగా టెహ్రాన్ తమపై దాడి చేస్తే మాత్రం ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది.

ఇదిలా ఉండగా.. యూఎస్-ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ పోర్టుల నుంచి నౌకలు హోర్ముజ్ మీదుగా రాకపోకలు సాగించకుండా నేటి సాయంత్రం 7.30 (భారత కాలమానం ప్రకారం) నిర్బంధం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో పాటు ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్‌లు మళ్లీ దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ దాడులను ప్లాన్ చేస్తున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్మీ సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఇజ్రాయెల్ రక్షణ దళం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆదేశించారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత స్థాయిలో దాడులు చేసేందుకు ట్రంప్, ఆయన సలహాదారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధించి చర్చల్లో ప్రతిష్టంభనను తొలగించాలనేది యూఎస్ ప్రభుత్వం ఉద్దేశమని కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా నాటో దేశాలను కూడా రంగంలోకి దింపేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే హోర్ముజ్ మీదుగా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన విషయం తెలిసిందే.

హోర్ముజ్ జలాల్లోకి యూఎస్ యుద్ధ నౌకలు వస్తే దాడులు తప్పవని హెచ్చరించింది. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని తేల్చి చెప్పింది. యూఎస్ పెట్టిన అసమంజసమైన డిమాండ్స్ కారణంగానే చర్చల్లో పీటముడి పడిందని పేర్కొంది. అణు కార్యక్రమం వదులుకునే దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన హామీలు రాలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు.

# హోర్ముజ్‌పై ట్రంప్ వ్యాఖ్యలు

దిగ్బంధిస్తే తీవ్ర పరిణామాలు
ఘాటుగా హెచ్చరికలుచేసిన ఇరాన్




టెహ్రాన్, ఏప్రిల్13 హోర్ముజ్‌ను దిగ్బంధి స్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక లపై ఇరాన్ మరోసారి ఘాటుగా స్పందించింది. హోర్ముజ్ ఇప్పటికీ తమ నియంత్రణలోనే ఉందని పేర్కొంది. శత్రువులు ఏ చిన్న పొరపాటు చేసినా ప్రమాదం తప్పదని హెచ్చరించింది. అంతకుముందు ఇరాన్ సైనిక దళం (ఐఆర్‌జీసీ) కూడా ట్రంప్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. హోర్ముజ్ వైపు వచ్చే యుద్ధ నౌకలపై దాడి చేస్తామని హెచ్చరించింది. పౌర నౌకల రాకపోకలకు మాత్రం ఎలాంటి ఇబ్బందీ ఉండదని భరోసా ఇచ్చింది. యుద్ధ నౌకలు వస్తే మాత్రం కాల్పుల విరమణను ఉల్లంఘించినట్టేనని స్పష్టం చేసింది. ఇక యూఎస్‌తో చర్చలు విఫలం కావడంపై ఇరాన్ మంత్రి అరాగ్చీ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 47 ఏళ్ల తరువాత జరిగిన అత్యున్నత స్థాయి చర్చలకు తాము సదుద్దేశంతో వెళ్లామని చెప్పారు. ఒప్పందం అంగుళం దూరంలో ఉండగా యూఎస్ తన లక్ష్యాలను, ఉద్దేశాలను మార్చుకుందని ఆరోపించారు. మునుపటి అనుభవాల నుంచి ఎలాంటి గుణపాఠాలను అమెరికా నేర్చుకోలేదని అన్నారు. మంచి భావాలుంటే చివరకు మంచే జరుగుతుందని అన్నారు. మనసులో శత్రుత్వం ఉంటే తుదకు అదే మిగుల తుందని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. సోమవారం హోర్ముజ్‌లో నౌకల ట్రాఫిక్ స్తంభించిపోయిందని లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్ అనే మారిటైమ్ సంస్థ తాజాగా పేర్కొంది. హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న ట్రంప్ ప్రకటన తరువాత నౌకల రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొంది. ఎలాంటి ఒప్పందం లేకుండా ఇరాన్‌తో చర్చలు ముగియడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మాత్రం కొనసాగుతోందని అన్నారు. ఇరాన్ మళ్లీ చర్చలకు వస్తుందా? రాదా? అనేది తనకు ఇక అనవసరమని కూడా చెప్పారు. ఇప్పటికే ఇరాన్ పరిస్థితి దగజారిందని, మిలిటరీ ధ్వంసమైపోయిందని చెప్పారు. శాంతి చర్చలు విఫలమవడానికి అమెరికానే కారణమని ఇరాన్ ఆరోపించింది. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో ఇరాన్ చిత్తశు ద్ధితో సంప్రదింపులు చేసింది. కానీ, ఇస్లామాబాద్ ఒప్పందానికి కొన్ని అంగుళాల దూరంలోనే చర్చలు కుప్పకూలాయి. అతివాద భావజాలం, లక్ష్యాలు మారడం, నిర్బంధం వంటివి మాకు ఎదురయ్యాయి. మంచి చేస్తే మంచి జరుగుతుంది. చెడు చేయాలని చూస్తే శత్రుత్వమే మిగులుతుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పోస్ట్ చేశారు.

# వికసిత భారత్ లక్ష్య సాధనలో మినరల్స్ కూడా కీలకమే

మినరల్ రంగంలో ఆత్మనిర్భరత భారత్‌పై ప్రత్యేక దృష్టి
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్13: ప్రపంచవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్ ప్రాముఖ్యం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో మినరల్స్ కీలకమని చెప్పుకొచ్చారు. మినరల్ రంగంలో ఆత్మనిర్భరత సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్‌ఐసీసీలో భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2వ విడత ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ వేలం, 7వ విడత క్రిటికల్ / స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ వేలం కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. జియోపాలిటిక్స్, క్లైమేట్ మార్పు, ఆర్థిక భద్రతలో ఈ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 46 బ్లాక్స్ వేలం విజయవంతంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి వెల్లడించారు. 7వ విడతలో 19 బ్లాక్స్‌ల వేలం ప్రారంభమైందన్నారు. మినరల్ ఎక్స్‌ఎ÷-లోరేషన్ లైసెన్స్ మొదటి విడత ప్రారంభమైందని.. త్వరలోనే 11 బ్లాక్స్‌లకు రెండో విడత లైసెన్స్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో 2 వెనేడియం, టైటానియం బ్లాక్స్ సిద్ధం చేసినట్లు మంత్రి ప్రకటించారు. మైనింగ్ కార్యకలాపాలను వేగవంతం చేయడం కోసం చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలు స్వతంత్రంగా వేలం నిర్వహించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు.

పర్యావరణ అనుమతుల ప్రక్రియను సరళీకరించడం, 24 మినరల్స్‌పై కస్టమ్స్ డ్యూటీ రద్దు చేయడం, త్వరగా ఉత్పత్తి ప్రారంభించే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడం వంటి చర్యలు తీసుకోనున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. స్క్రాప్ నుంచి మినరల్స్ రీసైక్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. విదేశాల్లో మైనింగ్ ప్రయత్నాలు చేపట్టామని తెలిపారు. రక్షణ రంగం, ఎలక్ట్రిక్ వెహికల్స్, గ్రీన్ ఎనర్జీకి క్రిటికల్ మినరల్స్ కీలకమని.. ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌ను గ్లోబల్ మైనింగ్ లీడర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# రేపల్లెలో 'శిరోరక్ష -- ప్రాణరక్ష' భారీ హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ

**- ఏప్రిల్ 16 నుంచి హెల్మెట్ లేకపోతే కఠిన చర్యలు- జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపిఎస్ హెచ్చరిక**

రేపల్లె, ఏప్రిల్13(వివేక సమయం
బాపట్ల జిల్లా పోలీసు యంత్రాంగం చేపట్టిన శిరోరక్ష ప్రాణరక్ష కార్యక్రమంలో భాగంగా రేపల్లె పట్టణంలో భారీ హెల్మెట్ అవగాహన ర్యాలీ అట్టహాసంగా నిర్వహించబడింది. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ స్వయంగా ఈ ర్యాలీని ప్రారంభించి, ద్విచక్ర వాహనదారుల రక్షణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టాన్ని నివారించడమే పోలీసు శాఖ లక్ష్యమని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాలను విశ్లేషిస్తే, 32% నుండి 40% ప్రమాదాలు ద్విచక్ర వాహనదారులకే జరుగుతున్నాయని, అందులోనూ తలకు తీవ్ర గాయాలు కావడం వల్లే మరణాల శాతం అధికంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఏప్రిల్ 16



నుండి జరిమానాల వేటప్రజల్లో మార్పు తీసుకురావడానికి ఏప్రిల్ 1 నుండి 15 వరకు అవగాహన గడువు విధించామని ఎస్పీ పేర్కొన్నారు. ఏప్రిల్ 16వ తేదీ నుండి నిబంధనలు కఠినతరం చేస్తామని, హెల్మెట్ ధరించని వారిపై మోటార్ వాహన చట్టం ప్రకారం భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. పోలీసులు ఫైన్ వేస్తారనే భయంతో కాకుండా, మిమ్మల్ని నమ్ముకున్న మీ కుటుంబం కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా



హెల్మెట్ ధరించాలి అని ఆయన పిలుపునిచ్చారు. సుమారు 120 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది స్వయంగా హెల్మెట్లు ధరించి పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా ర్యాలీ నిర్వహించారు. మీ ప్రయాణం సురక్షితం కావాలంటే హెల్మెట్ ధరించడం మీ బాధ్యత అంటూ నినదిస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ కార్యక్రమంలో
పలువురు పోలీసు ఉన్నతాధికారులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఏప్రిల్ 14 నుంచి ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు

## కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్ వి. వినోద్ కుమార్


బాపట్ల, ఏప్రిల్ 13 వివేక సమయం
బాపట్ల జిల్లాలో ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ ప్రకటించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వారోత్సవాలకు సంబంధించిన అవగాహన కరపత్రాలు ఫ్లెక్సీలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వారం రోజుల కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 14 అమరవీరుల సంస్మరణ దినం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించి, కేంద్రాల్లో పరికరాలను ప్రదర్శిస్తారు.ఏప్రిల్ 15 ప్రజా అవగాహన రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వంటి జనసమ్మర్థ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణపై ప్రచారం నిర్వహిస్తారు. ఏప్రిల్ 16 గృహ భద్రత గ్యాస్ సిలిండర్ల వాడకం, కిచెన్ సేఫ్టీపై అపార్ట్‌మెంట్ నివాసితులకు అవగాహన కల్పిస్తారు. ఏప్రిల్ 17 స్కూల్ మాక్ డ్రిల్స్ పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు ఆపద సమయంలో సురక్షితంగా బయటపడే విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శిస్తారు.ఏప్రిల్ 18 శిక్షణ పెట్రోల్ బంకులు, ఎల్పిజి గోడౌన్ల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.ఏప్రిల్ 19 ఆసుపత్రుల తనిఖీ హాస్పిటల్ సిబ్బందికి అగ్నిమాపక సాధనాల వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు.ఏప్రిల్ 20




ముగింపు పరిశ్రమల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి వారోత్సవాలను ముగిస్తారు. ఈ వారోత్సవాల్లో జిల్లా విపత్తు స్పందన అగ్నిమాపక సేవల శాఖ అధికారులు చురుగ్గా పాల్గొని, క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ కావాలని కలెక్టర్ ఆదేశించారు.

# కలెక్టరేట్ లో చలివేంద్రం ప్రారంభించిన కలెక్టర్

గుంటూరు ఏప్రిల్ 13 వివేక సమయం )సోమవారం కలెక్టరేట్ ఆవరణలో చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తో కలిసి ప్రారంభించారు. పీజీఆర్ఎస్ కు విచ్చేసిన దరఖాస్తుదారులకు మజ్జిగ కూడా పంపిణీ చేశారు. వేసవి ఎండలు దృష్ట్యా కలెక్టరేట్ అవరణ లోని వివిధ శాఖల కార్యాలయాలకు వచ్చే సందర్శకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి సోమవారం చలివేంద్రంలో నీరు, మజ్జిగ పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. వేసవి ఎండలు తీవ్రత దృష్ట్యా రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ జారీ చేసిన ఆరోగ్య భద్రత సూచనలు ప్రతి ఒక్కరు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కే. ఖాజావలి,జిల్లా విపత్తుల నిర్వహణ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీ కుమారి,జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ వి. జ్యోతిబసు,డీఆర్డీఎ పీడీ విజయలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు చెన్నయ్య, డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



# పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం జిల్లా ఎస్పీ

గుంటూరు ఏప్రిల్ 13 వివేక సమయం)జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార సమావేశం (పిజిఆర్ఎస్ -- పబ్లిక్ గ్రీవేన్స్ రెడ్రెస్సల్ సిస్టం ) సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఇతర జిల్లా పోలీస్ ఉన్నతా కారులతో కలసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు మరియు వినతిపత్రాలను జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు నేరుగా అందజేశారు
ముఖ్యంగా కుటుంబ కలహాలు,ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు మరియు ఇతర వివిధ అంశాలకు సంబంధించిన 178 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రజల సమస్యలను సమయానుకూ ంగా పరిష్కరించడం పోలీస్ శాఖ ముఖ్య బాధ్యత అని తెలిపారు. అలాగే, ఫిర్యాదుదారులకు వివిధ మోసాల పట్ల చట్టపరమైన



అవగాహన కల్పిస్తూ,అవసరమైన సూచనలు ఇచ్చారు.ప్రజలు ఎలాంటి భయాందోళ నలకు గురికాకుండా తమ సమస్యలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు.నూతన పిజిఆర్ఎస్ భవనంలో ప్రజలు సౌకర్యవంతంగా,గౌరవ ప్రదంగా తమ ఫిర్యాదులు పోలీస్ అధికారులకు విన్నవించేందుకు తగిన వాతావరణాన్ని కల్పించారు.ఈ ఏర్పాట్ల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్స్) సుప్రజ, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి,వెస్ట్ సబ్ డివిజన్ ఇంచార్జి డిఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, ఈస్ట్ డిఎస్పీ అబ్దుల్ అజీజ్,పిజిఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంధుల ఆశ్రమానికి సీలింగ్ ఫ్యాన్ వితరణ

పొన్నూరు ఏప్రిల్ 13 వివేక సమయం
గుంటూరు కు చెందిన పాలపర్తి వెంకట శివ నాగ ప్రసాద్ పుట్టినరోజును పురస్కరిం చుకుని, మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని శ్రీ షిర్డి సాయి దీన జన సేవాసమితి (అంధుల మరియు వికలాంగుల ఆశ్రమం) కు సీలింగ్ ఫ్యాన్‌ను విరాళంగా అందజేశారు.
శివ నాగ ప్రసాద్ తన పుట్టినరోజు సందర్భంగా ఆడంబరాలకు పోకుండా, ఆశ్రమంలోని అంధులు మరియు వికలాంగుల సౌకర్యార్థం ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన భార్య హేమలత, కుమార్తె హేత్విక, కుమారుడు మయాంక్ మరియు ఇతర కుటుంబ సభ్యుల సహకారంతో ఈ ఫ్యాన్‌ను ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, పుట్టినరోజు వంటి శుభకార్యాల వేళ సామాజిక బాధ్యతతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు
ఈ కార్యక్రమంలో పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమలశెట్టి ఉమాశంకర్, ట్రెజరర్ చిలకపాటి సింహాద్రి నరసింహారావు, శివ నాగ ప్రసాద్ కుటుంబ సభ్యులు మరియు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# ఆపదలో ఉన్న వారికి అండగా మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏడవసారి రక్తదానం చేసిన నరసింహారావు.

పొన్నూరు ఏప్రిల్ 13 వివేక సమయంసాటి మనిషి ప్రాణం ప్రమాదంలో ఉందని తెలిస్తే చాలు, మేమున్నామంటూ ముందుకొస్తోంది 'మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్'. తాజాగా గుంటూరు జి.జి.హెచ్ (జి జి హెచ్) లో రక్తం అందక ఇబ్బంది పడుతున్న రోగి కోసం అసోసియేషన్ సభ్యుడు నరసింహారావు ఉదారత చాటుకున్నారు.అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ ఫోన్ చేసిన వెంటనే నేను ఇస్తాను అని, నరసింహారావు తక్షణమే ఆసుపత్రికి చేరుకుని రక్తాన్ని అందజేశారు. ఇప్పటివరకు ఆయన 7 సార్లు రక్తదానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి రక్తం అందించడం కంటే మించిన సేవ లేదని, తమ అసోసియేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమయానికి స్పందించి ప్రాణదాతగా నిలిచిన నరసింహారావును అసోసియేషన్ సభ్యులు మరియు రోగి బంధువులు అభినందించారు



# (డా. బి. ఆర్. అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలతో...)

శీర్షిక:

**"" సంస్కరణల సూరీడు""**

ఊరు చివర మా పాకలెందుకు!?
పేరు చివర మీకు ఆ తోకలెందుకని
చూపుడు వేలి తో ఎత్తి చూపుతూ
ఆనాటి సమాజాన్ని నిగ్గదీసి
ప్రశ్నించాడుడా. బి. ఆర్. అంబేద్కర్
ధీరోధాత్తుడై నిలిచాడు!
ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదిగి
ఉన్నత చదువులు అభ్యసించి
ఉత్తమ వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటూ
ఎదిగే కొద్దీ ఒదిగి ఉంటూ
ఎదిగొచ్చిన మూలాలను మరువకుండా
ఉంటూపదవులకై ప్రాకులాడక
కోరి వరించిన పదవులకు వన్నె తెచ్చిన
బహుముఖ ప్రజ్ఞాశాలి డా. బి. ఆర్.
అంబేద్కర్!
దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక
పరిపాలనా సౌలభ్యం కొరకు
ప్రజాస్వామ్య పరిరక్షణయే ధ్యేయంగా
బడుగు బలహీన వర్గాల ఉన్నతియే
లక్ష్యంగా
రచించి, అందించాడు అతి పెద్ద
రాజ్యాంగాన్ని
. కల్పించాడు బడుగు బలహీన వర్గాలకు
అన్ని రంగాల్లో రిజర్వేషన్ల సౌకర్యాన్ని!
దళిత జనుల జీవితాల్లో దళిత సూరీడోలే



వెలుగుల కిరణాలను ప్రసరింప చేసాడు
కమ్మిన చిమ్మ చీకట్లను చీల్చి
చెండాడాడు!
బీద కుటుంబంలో జన్మించి
పేదరికాన్ని అనుభవించి
అంటరానితనపు అవహేళనలను
అనుభూతించి
అవమానాలతో మనస్సు కలత చెంది
సామాజిక చైతన్యానికై ఉద్యమించాడు
సంస్కరణల భానుడై ప్రకాశించాడు!
మతాల సారం మానవత్వమని
శాంతి సామరస్యాలే జగతికి తక్షణ
ఆవశ్యకా లని తలచి
బుద్ధం శరణం గచ్ఛామి అంటూ
బౌద్ధమతాన్ని స్వీకరించాడు
శాంతి మంత్రాన్ని లోకానికి
ప్రభోదించాడు!!!.

రచన:
డా. ఆళ్ల నాగేశ్వరరావు
( కమల శ్రీ)
తెనాలి... 522201
గుంటూరు... జిల్లా
ఆంధ్రప్రదేశ్... రాష్ట్రము
చరవాణి'7416638823

# మత్తు వదలరా..భవిష్యత్తు చెడగొట్టుకోకరా.!

## పొన్నూరులో డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ యాత్ర హోరు

పొన్నూరు ఏప్రిల్ 13(**వివేకసమయం**
గుంటూరు జిల్లా,పొన్నూరు క్షణం ఇచ్చే కిక్కు కోసం జీవితాంతం నరకం అనుభవించొద్దని,మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేశ్ బాబు యువతకు పిలుపుని చ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రగ్స్ వద్దు బ్రో రాష్ట్రవ్యాప్త సైకిల్ యాత్ర సోమవారం పొన్నూరు పట్టణానికి చేరుకుంది.తిరుపతి నుంచి విశాఖపట్నం వరకు వేలాది కిలోమీటర్ల లక్ష్యంతో సాగుతున్న ఈ యాత్రకు పట్టణ సరిహద్దుల్లో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ రమేశ్ బాబు పాల్గొని,డ్రగ్స్ మహమ్మారిపై ఘాటుగా స్పందించారు. కమిషనర్ మాట్లాడుతూజీవితం ముఖ్యం, వ్యసనం కాదు, ఒక్కసారి మత్తుకు బానిసలైతే అది ప్రాణాలను తీయడమే కాకుండా,కన్నవారి కలలను, నమ్ముకున్న కుటుంబాన్ని రోడ్డున పడేస్తుందని హెచ్చరించారు.
మత్తు పదార్థాల మాఫియా చిగురుటాకుల్లాంటి యువతను లక్ష్యంగా చేసుకుంటోందని, అప్రమత్తంగా ఉండకపోతే జీవితం చిన్నాభిన్నం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆరోగ్యకర సమాజం మన బాధ్యత,శారీరక, మానసిక దృఢత్వాన్ని దెబ్బతీసే మత్తు పదార్థాలను సమాజం నుంచి తరిమికొట్టాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో సైనికుల్లా పని చేయాలని కమిషనర్ కోరారు.
తిరుపతిలో ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర దారిపొడవునా గ్రామాల్లో, పట్టణాల్లో విద్యార్థులకు, యువతకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ సాగుతోంది. పొన్నూరులో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వద్దు బ్రో అంటూ నినదించారు.క్షణికానందం కోసం జీవితాలను బలిపీఠం ఎక్కించవద్దని, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడమే ఈ యాత్ర అంతిమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.





## రాష్ట్రపతిని కలిసిన లోకేశ్ బృందం

న్యూఢిల్లీ,ఏప్రిల్13 రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఎపి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. అమరావతి బిల్లు అమల్లోకి రావడంతో ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు ముర్ముతో భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు. అమరావతి రాజధాని ప్రజల కల అన్నారు. ఇందుకోసం రైతులు 33 వేల ఎకరాలు ఉదారంగా ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని వివరించారు.

## శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రైలు

### హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిన రామ్మోహన్



శ్రీకాకుళం,ఏప్రిల్13 శ్రీకాకుళం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా మొదటి రెగ్యులర్ రైలు ప్రారంభమైంది. హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. రూ.35 కోట్లతో శ్రీకాకుళం రైల్వేస్టే షన్ అభివృద్ధి చేశామని రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరిందంటూ ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 75 ఏళ్ల జిల్లా చరిత్రలో తొలిసారిగా శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రెగ్యులర్ రైలు సర్వీస్ ప్రారంభమైందని తెలిపారు. త్వరలో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పూర్తవుతుందని తెలిపారు. ఇక హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి ప్రతి సోమవారం, తిరుపతి నుంచి ప్రతి ఆదివారం అందుబాటులో ఉంటుంది. గతంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని శ్రీకాకుళం నుంచి తిరుపతికి రైలు నడపాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరారు. వెంటనే స్పందించిన రైల్వేమంత్రి ఈ ప్రతిపాదనలపై అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రెగ్యులర్ రైలును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈక్రమంలో తాజాగా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి రైలు నంబర్ 17439/40 హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ఈ హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి బయల్దేరుతుంది.. అలాగే ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్డు నుంచి బయల్దేరుతుంది.

## అదుపుతప్పి కారు బోల్తా

కడప,ఏప్రిల్13 జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలిన వివరాల మేరకు.. అట్లూరు గోపవరం మండలానికి చెందిన చెన్నకేశవులు, శివచందులు కారులో ప్రయాణిస్తున్నారు. బద్వేల్ పట్టణ శివారులోని మడకలవారిపల్లె దగ్గర కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న చెన్నకేశవులు, శివచందు తీవ్ర గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో గాయపడ్డ ఇద్దరినీ దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


## త్యాగరాయ గాన సభలో బహుముఖ సేవలకు జర్నలిస్ట్ పారువెల్లి దుర్గ భవాని కి భారత రత్నం పురస్కారం.



హైదరాబాద్ ఏప్రిల్ 13 **వివేకసమయం**
హైదరాబాద్‌లోని ప్రసిద్ధ త్యాగరాయ గాన సభలో ఆర్ట్ ఆఫ్ లెర్నింగ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో కళా,సామాజిక మరియు సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పారువెల్లి దుర్గభవాని కు భారతరత్నం పురస్కారం తో అతిథులు ఘనంగా సత్కరించారు.అవార్డు గ్రహిత జర్నలిస్ట్ దుర్గభవాని ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ లో సీనియర్ ఫైనాన్షియల్ కన్సల్టెంట్‌గా,హెల్త్ అండ్ జనరల్ ఇన్సూరెన్స్ గా సేవలందిస్తూ,ప్రజల్లో ఆర్థిక భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు.అలాగే హ్యూమన్ రైట్స్ మరియు కన్స్యూమర్ రైట్స్ ఉమెన్స్ వింగ్‌లో చురుకైన పాత్ర పోషిస్తూ,మహిళల హక్కులు మరియు వినియోగదారుల రక్షణ కోసం విశేష కృషి చేస్తున్నారు.మీడియా రంగంలో ప్రెస్ ఇన్‌ఛార్జ్‌గా తన అక్షర వార్తలతో సమాజానికి అవసరమైన సమాచారం అందిస్తున్నారు.అదేవిధంగా సైబర్ సురక్ష సోల్జర్ గా పనిచేస్తూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడం,ఆన్‌లైన్ భద్రతపై సూచనలు ఇవ్వడం ద్వారా డిజిటల్ భద్రతకు ముఖ్యంగా సేవలందిస్తున్నారు.కళారంగంపై ప్రత్యేక ఆసక్తితో, సాంస్కృతిక విలువలను ప్రోత్సహిస్తూ సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడుతున్న ఆమె విలువైన సేవలను గుర్తించి ఈ పురస్కారం ప్రదానం చేయడం జరిగింది.పురస్కారం అందుకున్న సందర్భంగా అవార్డు గ్రహిత జర్నలిస్ట్ దుర్గభవాని మాట్లాడుతూ త్యాగరాయ గాన సభ వంటి ప్రతిష్టాత్మక వేదికపై ఈ గౌరవం అందుకోవడం నా జీవితంలో ప్రత్యేకమైన క్షణమని,సమాజ సేవలో ఇంకా ముందుకు సాగుతాను అని తెలిపారు.రిజిస్టర్డ్ డిప్లొమా ఇన్ నర్సింగ్ & మిడ్వైఫరీ,పొయట్ జర్నలిస్ట్,ఫ్యామిలీ మోటివేటర్,ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ డివిజనల్ సెక్రటరీ నీలాజ్యోతి మాట్లాడుతూ సమాజానికి తమ వంతు కృషి చేస్తున్న ఆత్మీయ శ్రేయోభిలాషి జర్నలిస్ట్ దుర్గభవాని మున్ముందు ఎన్నో ప్రత్యేకమైన అవార్డులు అందుకోవాలని కోరుకుంటూ, ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖులు,కళాకారులు,
సామాజిక సేవకులు పాల్గొని ఆమె సేవలను ప్రశంసించారు.ఈ కార్యక్రమం ఎంతో ఘనంగా,సాంస్కృతిక వాతావరణంలో విజయవంతంగా జరగడం పలువురు ప్రత్యేక అభినందనలు తెలపడం జరిగింది.

## రాష్ట్ర స్థాయి మాజీ సైనికుల సంక్షేమ సంఘం ( ఏ పీ ఆర్ ఏం ఎస్ ఎస్ ఎస్ ) ప్రథమ వార్షికోత్సవానికి బాపట్ల కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ను అహ్వానిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు






బాపట్ల ఏప్రిల్ 13 **వివేకసమయం** ఏప్రిల్ 19 వ తేదీన బాపట్ల లోని శ్రీ అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో జరగబోవు రాష్ట్ర స్థాయి మాజీ సైనికుల సంక్షేమ సంఘం (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం) యొక్క ప్రథమ వార్షికోత్సవానికి రావాల్సి దిగా కోరుచూ, ఆహ్వాన పత్రికను బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ గారికి అందిస్తున్న మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు.
ార్యక్రమంలో రాష్ట్ర కమిటీ గౌరవ సలహాదారులు సుంకర శేషగిరి రావు, బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు, సీనియర్ మాజీ సైనికులు అబ్దుల్ రజాక్, రుక్మదర రావు, జంపని శ్రీనివాసరావు మొదలగు వారు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మరోసారి నిర్లక్ష్యం బయటపడింది

గుంటూరు ఏప్రిల్ 13 వివేకసమయం




గుంటూరు ఆ ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు అందాల్సిన అత్యవసర వైద్య సేవలు అందకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఐ సి యూ లో పడకలు లేకపోవడం సరైన పరికరాల కొరత, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రోగుల పరిస్థితి మరింత విషమంగా మారుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్యవసర పరీక్షలు అయిన ఎం ఆర్ ఐ స్కాన్లు చేయించడానికి కూడా రోగులను ప్రైవేట్ సెంటర్లకు పంపిస్తున్నారని బాధితులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందాల్సిన సేవలకు భారీగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తమవుతోంది.రోగుల కుటుంబ సభ్యులు చెబుతున్న వివరాల ప్రకారం, సమయానికి చికిత్స అందక ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారుఇలాంటి పరిస్థితుల్లో బాధ్యత ఎవరిది? ప్రజల ఆరోగ్యంపై ఈ నిర్లక్ష్యం ఎప్పుడు ముగుస్తుంది? అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# హెల్మెట్ ధరించండి -- ప్రాణాలను కాపాడుకోండి

## వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ పిలుపు

### ప్రజల భద్రత కోసం Arrive Alive కార్యక్రమం





వివేక సమయం ప్రతినిధి ఎల్కతుర్తి : హనుమకొండ జిల్లా ఎలుకతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ూతీతీఅజవ ూశ్రీఅజవ" కార్యక్రమం ప్రధాన ఉద్దేశం ప్రజలు సురక్షితంగా ప్రయాణించడం అని తెలిపారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు.

**ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి**

ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, త్రిబుల్ రైడింగ్ చేయకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. గ్రామంలో ఉన్న 200 వాహనాలలో 150 మందికి హెల్మెట్ వినియోగం ఉండటం శుభ పరిణామమని, మిగతావారు కూడా వెంటనే అలవాటు చేసుకోవాలని కోరారు.డీసీపీ ధర కవిత మాట్లాడుతూ, హెల్మెట్ వినియోగంపై గ్రామపంచాయతీ స్థాయిలో తీసుకున్న కఠిన నిర్ణయం అభినందనీయం అన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయనీయకూడదన్న తీర్మానం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.ఏసీపీ పింగళి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగియాలని, ఇతరులకు హాని కలగకుండా ఉండాలని సూచించారు. ఒక ప్రాణ నష్టం కుటుంబాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిఐ పులి రమేష్, ఎస్‌హెచ్ఓ అక్కినేపల్లి ప్రవీణ్ కుమార్, గ్రామ సర్పంచ్ రజిత, మార్కెట్ కమిటీ చైర్మన్ సుకిన్యా సంతోష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవడం మాత్రమే కాకుండా, కుటుంబాల భవిష్యత్తును కూడా రక్షించవచ్చని అధికారులు పిలుపునిచ్చారు.

## నాంపల్లి రెడ్‌హిల్స్‌లో అగ్నిప్రమాదం

**సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది**

హైదరాబాద్,ఏప్రిల్13 నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని మూడంతస్తుల భవనంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. భవనం మూడో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో భవనంలో 23 మంది నివాసితులు ఉన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. భవనంలో చిక్కుకున్న 23 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాణనష్టం ఏమీ లేదని అధికారులు తెలిపారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నప్పటికీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది త్వరితగతిన స్పందించి.. మంటలు ఇతర ఫ్లోర్లకు వ్యాపించకుండా నివారించారు. చివరకు మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటలు పూర్తిగా అదుపులోకి రావడం, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అగ్నిప్రమాదంపై స్థానిక పోలీసులు, అగ్నిమాపక అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు.

## వచ్చే విద్యాసంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు

***15నుంచి సీట్ల భర్తీకి తొలివిడత ప్రక్రియ***

***తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల***




హైదరాబాద్,ఏప్రిల్13 రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం 2026-27లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే దోస్త్ నోటిఫికేషన్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతుంది.

అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఒక మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ పక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ పక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

## తట్టేపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

***స్కూటీని ఢీకొట్టిన లారీ***

***ప్రమాదంలో దంపతులతో సహా చిన్నారి మృతి***

వికారాబాద్,ఏప్రిల్13 వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. పెద్దేముల్ మండలం తట్టేపల్లి దగ్గర ఓ టూ వీలర్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలు సహా ఓ చిన్నారి దుర్మరణం చెందింది. మృతులు తాండూరు నుంచి జహీరాబాద్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కాగా, యాక్సిడెంట్ తర్వాత పారిపోయిన లారీ డ్రైవర్.. పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది. పెద్దేముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలోని త్టటెపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వికారాబాద్ జిల్లా రుక్మాపూర్ గ్రామానికి చెందిన పావని (35), ఆమె భర్త కవిరాజ్ (40) జహీరాబాద్‌లో నివసిస్తున్నారు. వీరు ఆదివారం సాయంత్రం జహీరాబాద్ నుంచి రుక్మాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా లారీ వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పావని, కవిరాజ్, కీర్తన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కుమారుడు కార్తీక్ స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహమ్మద్ షరీఫ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దేముల్ పోలీసులు తెలిపారు.

## విషగుళికలు తిని చిన్నారి మృతి

ములుగు,ఏప్రిల్13 ములుగు జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. కోతుల బెడద తప్పించు కోవడానికి పెట్టిన విషగుళికలు తిని నాలుగేళ్ల బాలుడు మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లా గోవిందరావుపేటలోని కోతుల బెడద ఎక్కువగా ఉంది. దీంతో కోతులను చంపేందుకు అంగన్‌వాడీ కేంద్రంలోని నర్సరీ ప్రాంతంలో గ్రామ పంచాయతీ సిబ్బంది విషగుళికలను పెట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలకు ఇచ్చే బాలామృతంలో వాసన లేకుండా ఉండే విష గుళికలను కలిపి పెట్టారు. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు శ్రవణ్ కుమారుడు హర్షిత్ నందన్ (4) ఆదివారం సాయంత్రం స్నేహితులతో ఆడుకుంటూ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోకి వెళ్లాడు. ఆ సమయంలో విష గుళికలు కలిపిన బాలామృతం చూశాడు. దాన్ని తినేశాడు. అనంతరం అస్వస్థతకు గురవ్వడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## అంబేద్కర్135వ జయంతి సందర్భం

**అజయ్ పురం గ్రామంలో బైక్ యాత్ర ప్రారంభం**

అనకాపల్లి,ఏప్రిల్13: అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ అజయ్ పురం గ్రామంలో గిరిజన సంఘం., కెవిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు.అజయ్ పరువు నుండి జోగంపేట, నేరేడు బంధ, కళ్యాణ్ లావా వరకు బైకే యాత్ర నిర్వహించడం జరిగింది. ఎస్సీ ఎస్టీ చట్టాన్ని ఆర్టికల్ 9 షెడ్యూల్లో చేర్చాలని, నాన్ షెడ్యూల్ గిరిజన మండలాలను ఏజెన్సీ ఏరియాలో కలపాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. రావికతం మండల కేంద్రంలో సర్వేనెంబర్ అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న చెత్తను తొలగించాలి. బాదంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 41-లో 5-80 చెట్లు భూమిలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం దళితులకు, గిరిజలకు కేటాయించాలి బాదంపాడు రెవిన్యూ పరిధిలో సీలింగ్ భూమి చుట్టూ బౌండరీ ఏర్పాటు చేయాలని తెలిపారు. దళితులకు గిరిజనులకు పట్టాలి ఇవ్వాలి. కొత్తకోట దళిత కాలనీకి మంచినీరు సౌకర్యం కల్పించాలి. గిరిజనులు సాగులోన భూములకు, సాగకు కల్పించి, గిరిజనులకు దళితులకు రక్షణ కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మోనాటరింగ్ కమిటీలో గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పించాలని, జెడ్ జోగంపేట పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు

. నర్సీపట్నం నుండి జెడ్ జోగిపేట్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, దళితులకు గిరిజనులకు ఇచ్చిన అధిక బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన దళితులకు గిరిజనులకు నర్సీపట్నంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సాయి కార్యదర్శి కే గోవిందరావు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాంగి చంద్రరావు. పాంగి పవన్ కుమార్. వంతల చిరంజీవి. గేమిల రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు

**మరోమారు పిటిషన్ దాఖలు చేసిన సునీత**



హైదరాబాద్,ఏప్రిల్13: మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తదుపరి దర్యాప్తును కొనసాగించేలా కేంద్ర దర్యాప్తు సంస్థకు ఆదేశాలు ఇవ్వాలంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను వివేకా కూతురు సునీతా రెడ్డి దాఖలు చేశారు. ఈ కేసులో కొన్ని కోణాలపై సీబీఐ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయలేదని, పలు అనుమానాలకు సమాధానాలు రాలేదని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువల్ల మరింత సమగ్ర తదుపరి దర్యాప్తు జరపాలని హైకోర్టును కోరారు. ఈ కేసు ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తులో ఉంది. గతంలో సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం కొన్ని వ్యక్తుల మధ్య జరిగిన ఫోన్ కాల్ డేటా సహా పలు సాంకేతిక ఆధారాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టింది. తదుపరి దర్యాప్తులో కొందరి పాత్ర లేదని పేర్కొంటూ సీబీఐ కోర్టుకు ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది. అయితే ఈ దర్యాప్తుపై పిటిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సునీతా రెడ్డి తన పిటిషన్‌లో పలు కీలక విషయాలను పేర్కొన్నారు. పలు సందేహాలకు సీబీఐ దర్యాప్తులో సమాధానం రాలేదని తెలిపారు. కొన్ని కోణాల్లో విచారణ పూర్తిగా జరగలేదని అన్నారు. ఈ కేసులోని కొన్ని అనుమానాస్పద అంశాలను విస్మరించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. అందువల్ల సీబీఐ కోర్టు ఉత్తర్వులను రద్దు చేసి, కేసులో ఇంకా స్పష్టత లేని అంశాలపై మరింత దర్యాప్తు చేయాలని ఆదేశించాలంటూ ఆమె హైకోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతోంది.

# పాదచారులపై దూసుకెళ్లిన ట్రక్కు

**ఏడుగురు వ్యక్తులు అక్కడిక్కడే మృతి**

రాజ్‌కోట్,ఏప్రిల్13 ఓ ట్రక్కు అదుపుతప్పి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళు_న్న యాత్రికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. వారిలో ఆరుగురు యాత్రికులు కాగా.. మరో వ్యక్తి రోడ్డు పక్కన తన వాహనం టైరు మారుస్తున్న డంపర్ డ్రైవర్. యాత్రికులు రాజస్థాన్‌లోని రాజ్‌కోట్ లోని గద్కా గ్రామం నుంచి దేకావాలా లోని మహదేవ్ ఆలయానికి వెళ్తుండగా.. సోమవారం తెల్లవారుజామున లఖ్తర్-విరామ్‌గామ్ రహదారిపై భాస్కర్‌పారా సమీపంలో ప్రమాదం జరిగింది. రాజ్‌కోట్‌లోని గధ్కా గ్రామం నుంచి దేకావాలాలోని మహాదేవ్ ఆలయానికి నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులు.. మార్గమధ్యలో భాస్కర్‌పారా సమీపంలో ఓ వ్యక్తి రోడ్డుపై ఆగిపోయిన డంపర్‌కు టైరు మారుస్తున్నాడు. యాత్రికులు ఆ డంపర్‌ను దాటుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ట్రక్కు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. అదేవిధంగా డంపర్ టైరు మారుస్తున్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు.దాంతో మొత్తం మృతుల సంఖ్య ఏడుకు చేరింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఒంటరి వృద్ధురాలిపై దాడి

కామారెడ్డి,ఏప్రిల్13 కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు మండల కేంద్రంలో జరిగిన దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇంట్లోకి చొరబడి ఓ వృద్ధురాలిపై రోకలిబండతో దాడి చేసి, ఆమె బంగారు ఆభరణాలను అపహరించిన ఘటన ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండల కేంద్రంలో నివసిస్తున్న ఓ వృద్ధురాలు తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో ఆమెపై అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డారు. దాడికి రోకలి బండను ఉపయోగించినట్లు సమాచారం. ఈ దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. దాడి సమయంలో ఆమె అరుస్తూ సహాయం కోరినప్పటికీ, దుండగులు ఆమె బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. వాటి విలువ ఎంతన్నది పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనలో వృద్ధురాలి తలకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. రక్తస్రావం అధికంగా ఉండటంతో స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సమీప ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ దారుణ ఘటనతో భిక్కనూరు ప్రాంత ప్రజల్లో భయాందోళన నెలకొంది. వృద్ధురాలిపై ఇంతటి క్రూరమైన దాడి జరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దుండగులు ముందుగా ఇంటి పరిస్థితిని గమనించి, ఎవరు లేని సమయం చూసి లోపలికి చొరబడినట్లు పోలీసులు భావిస్తున్నారు. బంగారు ఆభరణాల సమాచారం ముందుగానే తెలిసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ దాడి పథకం ప్రకారం జరిగిందా లేదా అకస్మాత్తుగా జరిగిన దోపిడీనా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ససమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను సేకరించి, అనుమానితులను గుర్తించడానికి చర్యలు చేపట్టారు. స్థానికుల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారు. పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని, దోషులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

# బీసీ జన జాగరణ జాతర పోస్టర్ ఆవిష్కరణ

## 19న హైదరాబాద్‌లో భారీ సభ



సిద్దిపేట, మార్చి 13
బీసీ రిజర్వేషన్లు, రాజ్యాధికారంలో వాటా సాధన లక్ష్యంగా ఈ నెల 19న హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న "బీసీ జన జాగరణ జాతర"కు సంబంధించిన పోస్టర్‌ను సిద్దిపేటలో ఘనంగా ఆవిష్కరించారు. స్థానిక నాగదేవత ఆలయ అవరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ప్రభురాజ్ గంగపుత్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సమాజం తన కుల అస్థిత్వం, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలంటే ఈ జాతర ఒక చారిత్రాత్మక అవకాశమని అన్నారు. ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేకుండా, బీసీల చైతన్యం మరియు రాజ్యాధికార లక్ష్యంతో పనిచేస్తున్న ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో ఈ భారీ బహిరంగ సభ నిర్వహించబడుతోందని తెలిపారు.
ఈ జాతరకు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు (అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు ప్రస్తుత, రిటైర్డ్ అధికారులు), కార్మిక–కర్షక సంఘాలు, లేబర్ యూనియన్లు, జర్నలిస్టులు తదితర వర్గాల బీసీలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి కులానికి చెందిన నాయకులు, సంఘాల పెద్దలు తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.
జాతర మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమై తెలంగాణ ధూంధాం కార్యక్రమాలు, బీసీ సమాజానికి చెందిన సినీ నటులు, కళాకారుల ప్రదర్శనలు, నాటకాలు, వక్తల ప్రసంగాలతో కొనసాగుతుందని తెలిపారు. "అన్ని కులాలూ సమానమే" అనే భావనను బలపరచడం ఈ జాతర ముఖ్య ఉద్దేశమని అన్నారు. మన కుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రదర్శిస్తూ మన అస్తిత్వాన్ని ప్రపంచానికి తెలియజేయాలంటే భారీ సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. తెలంగాణ వ్యాప్తంగా రవాణా సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. లక్షలాదిగా తరలివచ్చే బీసీలలో వేలాదిగా మనం పాల్గొని మన బలం చూపుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నెమలి సుభాష్, అడ్వకేట్ సంపత్, తత్తరి స్వామి, చెరుకు నారాయణ, కొయ్యడ చందు, భరత్, మహిళా బీసీ నాయకులు పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఊరుగొండలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన రేవూరి ప్రకాశ్ రెడ్డి



దామెర ఏప్రిల్ 13
?దామెర మండలం ఊరుగొండ గ్రామంలో సోమవారం పిఎసిఎస్ పెద్దాపురం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాల్ మొక్కజొన్నకు 2400 రూపాయల మద్దతు ధరను పొందేందుకు రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాలకే తరలించాలని ఆయన కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు పర్యవేక్షించాలని, సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

# 100 పడకల ఆసుపత్రి స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే నాగరాజు



వర్ధన్నపేట,ఏప్రిల్ 13
వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రికి కేటాయించిన దేవాదాయ శాఖ భూమిని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు సోమవారం పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన ఆయన, భూమికి త్వరితగతిన బౌండరీలు ఏర్పాటు చేయాలని రెవెన్యూఅధికారులకుసూచించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్ధన్నపేట ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆధునిక సదుపాయాలతో కూడిన 100 పడకల ఆసుపత్రిని నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ఈ ఆసుపత్రి ద్వారా వేలాది మందికి నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా చికిత్స అందేలా అన్ని ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ భూమిని ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించినందుకు మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు వేగవంతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ శిభారాణి రాజేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యం, కౌన్సిలర్లు పాపారావు, కమిలి భీమానాయక్, దేవేందర్, వాణి కుమారస్వామి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తుల్లా రవి, నాయకులు పోశాల వెంకన్న, రామకృష్ణ, మహేందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పెరుకపల్లిలో ఉపాధి హామీ పనులు ప్రారంభం



భూపాలపల్లి ఏప్రిల్ 13 మండలంలోని బౌసింగ్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పెరికపల్లె గ్రామంలో ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ పొనగంటి ముత్తమ్మ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వయంగా పనులను ప్రారంభిస్తూ మట్టిని తొలగించి శుభారంభం చేశారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధికి తోడ్పడుతుందని ఆమె తెలిపారు. ఉప సర్పంచ్ కోరుకంటి మహేందర్ మాట్లాడుతూ గ్రామంలో చేపట్టే పనులను నాణ్యతతో, సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ అవకాశాలను ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్,గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, కార్మికులు, గ్రామస్థులు పాల్గొని పనులను ప్రారంభించారు.

# రెంజర్ల రాజేష్ మాలల ద్రోహి

బైరమల్ల దుర్గ ప్రసాద్ -రాష్ట్ర అధ్యక్షుడు విద్యార్థి విభాగం



హన్మకొండ ఏప్రిల్ 13
మాల సంఘం పై అవగాహన లేకుండా డేనియల్ తప్పుడు నిర్ణయాలు మానుకోవాలని బైరమల్ల దుర్గ ప్రసాద్ డిమాండ్ చేశారు. రేంజర్ల రాజేష్ కు.. ఆహ్వానం పలుకుతున్న టీం జె ఏ సి మాల సంఘం నాయకులను ఏమనుకోవాలి. రెంజర్ల రాజేష్ వర్గీకరణ కు అనుకూలమా వ్యతిరేకమా డేనియల్ తన జీవితకాలంలో టీచర్ వృద్ధి లో ఉన్నప్పుడు ఏనాడు అంబేద్కర్ ఇజం వైపు కానీ ఏ ఒక్క స్టూడెంట్ కు సహాయం చేసిన దాఖలాలు లేవు.. ఏనాడు మాల ఉద్యమంలో లేని డానియల్ ఈరోజు రిటైర్డ్ తర్వాత మాల సంఘం అని పేరు చెప్పుకున్న డేనియల్ గారిని ఏమనాలి... ఆరోజు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న మలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డా పసుల రాంమూర్తి గారు మంద కృష్ణ మాదిగ ను హెచ్చరించినప్పుడు గోదావరి ఖని పోలీసులు ఏం ఆర్ పి ఎస్ వారు కేసులు పెట్టిన వారికి మద్దతు పలికిన రెంజర్ల రాజేష్ ను పిలవడం సంఘం ఉద్దేశం మాలలు తెలుసుకోవాలి మీరు మాల మహానాడు వైపు ఉన్నట్టా మంద కృష్ణ మాదిగ వైపు ఉన్నారా అనీ ప్రశ్నించారు మాల సంఘాన్ని డెవలప్ చేస్తున్నట్ట ఎందుకు ఇలా డబ్బులు వసూలు చేస్తూ ఇలాంటి పనులు చేస్తున్న రాని అడిగారు మిమ్మల్ని మరి మీరు ఎవరి కొమ్ముకాస్తున్నట్టు...మాల సమాజానికి డేనియల్ సమాధానం చెప్పాలనీ బైరమల్ల దుర్గ ప్రసాద్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యార్థి విభాగం డిమాండ్ చేశారు

# రాఘవేంద్ర కాలనీ లో నూతన కమిటీ హాల్ ప్రారంభోత్సవం.

### ఎంపీ ఈటెల రాజేందర్ ముదిరాజ్ తో కలిసి ప్రారంభించిన చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి.



కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 14:ుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్(కుత్బుల్లాపూర్ డివిజన్)పరిధి రాఘవేంద్ర కాలనీలో ఎంపి లాడ్స్ ఫండ్స్ మరియు కాలనీ సభ్యుల సహకారంతో,నూతనంగా నిర్మించిన కాలనీ కమిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి,ముఖ్య అతిధిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి కమిటీ హాల్ ని ప్రారంభించిన,బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుల ఈటల రాజేందర్ ముదిరాజ్ తో కలిసి,ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు నారాయణ, వెంకటేశ్వర రెడ్డి, మల్లా రెడ్డి, ఉమావతి, మల్లేష్ గౌడ్,కోటేశ్వరరావు,సతీష్,బాలరాజు,నర్సింహా రెడ్డి,సతీష్ చక్రవర్తి,నల్లనాగుల కృష్ణ,పెద్దింటి సాయిలు,శ్రీనివాస్ ముదిరాజ్,నందు గౌడ్,సందీప్ గౌడ్,మహేష్,శ్రవణ్,వర్మ,శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి - గిరివాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం.

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు ఏప్రిల్ 13ప్రజావాణి–గిరివాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి–గిరివాణి కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ వారినుంచి దరఖాస్తులను స్వీకరించి ఆయా శాఖల అధికారులకు అందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి – గిరివాణి కార్యక్రమంలో భూ సమస్యల గురించి 21, ఇందిరమ్మ ఇండ్ల గురించి 15, పెన్షన్స్ 16, ఉపాధి కల్పన 03, ఇతర శాఖలకు చెందినవి 17 మొత్తం 72 దరఖాస్తులు అందాయి.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి గిరివాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. అధికారులు అర్జీ దారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించకుండా వాటికి పరిష్కార మార్గం చూపాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎం పి డి ఓ లు, ఎం పి ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు ఘన నివాళులు:ఎంపీ రవిచంద్ర



హైదరాబాద్ ఏప్రిల్ 13
భారతరత్న, రాజ్యాంగ నిర్మాత, సామాజిక విప్లవకా రులు, సంఘ సంస్కర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఘనంగా నివాళులర్పించారు. అంటరానితనం,కుల నిర్మూలన, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన మహనీయులు అంబేద్కర్ అని తన ప్రకటనలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. న్యాయ,రాజనీతి, ఆర్థిక, సామాజిక శాస్త్రాలపై పట్టు సాధించిన గొప్ప విద్యావేత్త,పండితుడు అంబేద్కర్ అని ఆయన కొనియాడారు. అంబేద్కర్ దేశానికి గొప్ప లిఖిత రాజ్యాంగాన్ని అందించారని,అందులో స్వేచ్ఛ, న్యాయం,సమానత్వం,లౌకికవాదానికి ప్రత్యేక స్థానం కల్పించారని ఆయన వివరించారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు రాజ్యాంగంలో ఆర్టికల్ 3 పొందుపర్చిన దార్శనికులు అంబేద్కర్ అని,దీంతో తెలంగాణ అవతరణ జరిగిందన్నారు. ఆ మహనీయుడి స్ఫూర్తితో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పలు పథకాలు, కార్యక్రమాలకు రూపకల్పన చేసి రాష్ట్రాన్ని దేశం మొత్తంమీద అగ్రగామిగా తీర్చిదిద్దారని చెప్పారు."దళితబంధు"పథకం తెచ్చి ఎస్సీల జీవితాల నుంచి చీకట్లను పారద్రోలి వెలుగులు నింపిన మహానేత కేసీఆర్ అని ఆయన కొనియాడారు. అన్ని వర్గాల వారికి ఉన్నత విద్యను మరింత చేరువ చేసేందుకు గాను పెద్ద సంఖ్యలో గురుకులాలు ప్రారంభించారని,విదేశాలలో విద్యనభ్యసించే ఎస్సీల కోసం "అంబేద్కర్ ఓవర్సీస్"పథకానికి తెచ్చి 20 లక్షల రూపాయల చొప్పున ఉచితంగా సాయమందించిన మహానేత కేసీఆర్ అని అయన ప్రస్తుతించారు.

# ఏప్రిల్ 19న మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రథమ వార్షికోత్సవం.

**కలెక్టర్ ను ఆహ్వానించిన తాండ్ర సాంబశివరావు.**









బాపట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం ఏపీఆర్ఎంఎస్ ఎస్ఎస్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని, బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ని రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన సంఘం ప్రతినిధులు, ఏప్రిల్ 19వ తేదీన బాపట్ల పట్టణంలోని అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో జరగనున్న వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపం, బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్. రాష్ట్ర స్థాయి మాజీ సైనికుల సంక్షేమం సంఘం యొక్క ప్రథమ వార్షిక ప్రగతి నివేదనఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ, దేశ సేవలో నిమగ్నమై పదవీ విరమణ పొందిన మాజీ సైనికులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి సమస్యల పరిష్కారానికి మరియు సంక్షేమానికి ఈ సంఘం కృషి చేస్తోందని తెలిపారు.ఈ ఆహ్వాన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ గౌరవ సలహాదారులు సుంకర శేషగిరి రావు బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు సీనియర్ మాజీ సైనికులు అబ్దుల్ రజాక్, రుక్మదర రావు, జంపని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

**జిల్లా ఎస్పీ వకుల్ జిందల్.**



గుంటూరు ఏప్రిల్ 13

జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార సమావేశం పిజిఆర్ఎస్ – – పబ్లిక్ గ్రీవేన్స్ రెడ్రెస్సల్ సిస్టం సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఇతర జిల్లా పోలీస్ ఉన్నతాధికారులతో కలసి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు మరియు వినతిపత్రాలను జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు నేరుగా అందజేశారు.ముఖ్యంగా కుటుంబ కలహాలు,ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు మరియు ఇతర వివిధ అంశాలకు సంబంధించిన 178 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రజల సమస్యలను సమయానుకూలంగా పరిష్కరించడం పోలీస్ శాఖ ముఖ్య బాధ్యత అని తెలిపారు. అలాగే, ఫిర్యాదుదారులకు వివిధ మోసాల పట్ల చట్టపరమైన అవగాహన కల్పిస్తూ,అవసరమైన సూచనలు ఇచ్చారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు.నూతన పిజిఆర్ఎస్ భవనంలో ప్రజలు సౌకర్యవంతంగా,గౌరవ ప్రదంగా తమ ఫిర్యాదులు పోలీస్ అధికారులకు విన్నవించేందుకు తగిన వాతావరణాన్ని కల్పించారు.ఈ ఏర్పాట్ల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్స్) సుప్రజ, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి,వెస్ట్ సబ్ డివిజన్ ఇంచార్జి డిఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, ఈస్ట్ డిఎస్పీ అబ్దుల్ అజీజ్,పిజిఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి అమ్ముతున్న టెక్కీ పట్టివేత

హైదరాబాద్,ఏప్రిల్13 డబ్బు సంపాదించేందుకు అక్రమ మార్గం ఎంచుకున్నాడో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. మరో వ్యక్తితో కలిసి నగరంలో గంజాయి విక్రయాలు మొదలుపెట్టాడు. ఆ ఇద్దరిని పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి నానక్‌రామ్ గూడలో గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టయింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రేమానంద్ మల్లిక్, క్యాబ్ డ్రైవర్ విశాల్‌ను శేర్లింగంపల్లి ఎస్ఓటి, గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రేమానంద్ మల్లిక్, డ్రైవర్ విశాల్‌ను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 2.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించారు. కాగా వీరికి గంజాయి అమ్మిన రాఘవేంద్ర, ఆకాశ్ పరారీలో ఉన్నారు. వీరి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఏప్రిల్ 14 నుంచి ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు.

## కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్ వి. వినోద్ కుమార్




బాపట్ల, ఏప్రిల్ 13

బాపట్ల జిల్లాలో ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ ప్రకటించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వారోత్సవాలకు సంబంధించిన అవగాహన కరపత్రాలు ఫ్లెక్సీలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వారం రోజుల కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 14 అమరవీరుల సంస్మరణ దినం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించి, కేంద్రాల్లో పరికరాలను ప్రదర్శిస్తారు.ఏప్రిల్ 15 ప్రజా అవగాహన రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వంటి జనసమ్మర్థ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణపై ప్రచారం నిర్వహిస్తారు. ఏప్రిల్ 16 గృహ భద్రత గ్యాస్ సిలిండర్ల వాడకం, కిచెన్ సేఫ్టీపై అపార్ట్‌మెంట్ నివాసితులకు అవగాహన కల్పిస్తారు. ఏప్రిల్ 17 స్కూల్ మాక్ డ్రిల్స్ పాఠశాలలు, ద కాలేజీల్లో విద్యార్థులకు ఆపద సమయంలో సురక్షితంగా బయటపడే విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శిస్తారు.ఏప్రిల్ 18 శిక్షణ పెట్రోల్ బంకులు, ఎల్పిజి గోడౌన్ల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.ఏప్రిల్ 19 ఆసుపత్రుల తనిఖీ హాస్పిటల్ సిబ్బందికి అగ్నిమాపక సాధనాల వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు.ఏప్రిల్ 20 ముగింపు పరిశ్రమల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి వారోత్సవాలను ముగిస్తారు.ఈ వారోత్సవాల్లో జిల్లా విపత్తు స్పందన అగ్నిమాపక సేవల శాఖ అధికారులు చురుగ్గా పాల్గొని, క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ కావాలని కలెక్టర్ ఆదేశించారు.

# మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే ప్రతినిత్యం యోగాచేయాల్సిందే

**జిల్లా కలెక్టర్ సి నాగారాణి.**



భీమవరం ఏప్రిల్ 13

ప్రజలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే ప్రతినిత్యం యోగా, వ్యాయామాన్ని అలవాటు చేసుకోవడం అత్యవసరమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.భీమవరం పట్టణంలోని 34వ వార్డు పరిధిలో ఆదివారం ఉదయం 6:30 గంటల నుంచి 9:00 గంటల వరకు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో "హ్యాపీ సండే" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒడిశా ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ సురేష్ మహాపాత్ర, వారి సతీమణి కూడా ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిపూర్ణ ఆరోగ్యంతో జీవించాలన్నారు. ప్రతిరోజూ ఉదయం యోగా సాధన చేయడం ద్వారా శరీరానికి నియంత్రణ ఏర్పడి, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించుకోవచ్చని తెలిపారు. యువత తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించడం అవసరమని సూచించారు. అలాగే వృద్ధులు, మధ్య వయస్కులు యోగా సాధన ద్వారా కొన్ని దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించుకోవచ్చని పేర్కొన్నారు. "హ్యాపీ సండే" కార్యక్రమంలో భాగంగా యోగా, సైక్లింగ్ వంటి ఆరోగ్యకర కార్యకలాపాలతో పాటు పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటడం, వీధులను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలను కోరారు. పట్టణ జీవనశైలిలో ఒత్తిడిని తగ్గించడానికి సంగీతం, నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి. వృద్ధుల కోసం తేలికపాటి వ్యాయామాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొని ఆరోగ్యవంతమైన జీవనశైలిపై అవగాహన పొందారు. ఆరోగ్యమే మహాభాగ్యమని గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు మున్సిపల్ కమిషనర్ ఏ.రాంబాబు, మున్సిపల్ ఇన్‌చార్జ్ ఇంజనీర్ తాతబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, విష్ణు కళాశాల విద్యార్థులు, భారతి విద్యాభవన్ అనాథాశ్రమ విద్యార్థులు మరియు పట్టణ ప్రజలు విస్తృతంగా పాల్గొన్నారు.

# కుటుంబంలో స్త్రీ ఆరోగ్యంగా ఉంటే ఇల్లు బాగుంటుంది

- దేశం బాగుంటుంది.
- శిశు సంక్షేమ శాఖ అధికారులు.



హిందూపురం ఏప్రిల్13 స్థానిక మునిసిపాలిటీ పరిధిలోని బోయపేట – × అంగన్వాడీ కేంద్రంలో పాతకాలపు వంటల ప్రయోజనాలు వాటి ప్రాముఖ్యత గురించి ఐ సి డి ఎస్ సిడిపిఓ వరలక్ష్మి ,సూపర్ వైజర్ అనిత అంగన్వాడీ టీచర్ శైలజ సోమవారం గ్రామంలోని లబ్దిదారులకు తెలిపారు.తెల్లని పదర్థాలైన మైదా,చెక్కెర, బియ్యం వంటివి నిరాకరించాలి. వాటి వల్ల సగం బి.పి, కాన్సర్, చర్మవ్యాదులు, దీర్ఘకాలిక రోగాలు వస్తాయి. వాటి స్థానంలో పాతకాలపు వంటలు, తక్కువ ఖర్చుతో లభించేవి ఆరోగ్యంగా ఉండేవి రాగిరొట్టె,జొన్న రొట్టే, అకుకూరలు తింటే అరోగ్యంగా ఉంటాము. కుటుంబంలో స్త్రీ ఆరోగ్యంగా ఉంటే ఇల్లు బాగుంటుంది . ఆనందంగాఉంటుంది.ఊరు బాగుంటుంది. దేశం బాగుం టుంది అని శిశు సంక్షేమ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది , చిన్నారులు, వారి తల్లిదండ్రులుతదితరులు ఉన్నారు.

# కైకలూరు కుమూడి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ప్రారంభించిన శాసనసభ్యులు కామినేని.



ఏలూరు జిల్లా ఏప్రిల్ 13 ఏలూరు జిల్లా. కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలం లో కుమూడి గ్రామంలో కీర్తిశేషులు మత్తే సూర్యచంద్రరావు కుటుంబ సభ్యులు మరియు గ్రామ కమిటీ వారి ఆధ్వర్యంలో ఈరోజు డాక్టర్ బాబాసాహెబ్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రారంభించిన, శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ , శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ , మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విట్టల్ రావు , తెలుగుదేశం పార్టీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు , మరియు ఆంధ్రప్రదేశ్ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పైడిమర్రి మాల్యాద్రి , ఆంధ్రప్రదేశ్ టూరిజం డైరెక్టర్ కొడాలి వినోద్ , కైకలూరు ఏఎంసీ చైర్మన్ పెనుమత్స త్రినాధ రాజు , మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వరరావు (కొండ ) , బురుబొయిన శ్రీనివాసరావు (బి యస్ ఆర్) , పూల రాజి , బికేఎం నాని , లావేటి వీర శివాజీ , ఆదినారాయణ , చాపరాల దుర్గాప్రసాద్ , చాపత్తిన విజయ , మైగాపుల రామాంజనేయులు , మునగాల పృథ్వి , భాష ,ఉస్మాన్ , గంగుల శ్రీదేవి , బుజ్జి విజయ్ , సాంబశివరావు , లేళ్ల కృపారావు , కొలపర్రు మాజీ సర్పంచ్ నాగరాజు , తదితరులు పాల్గొన్నారు

# అక్రమ రేషన్ రవాణా పై అధికారుల తీరు.














భట్టిప్రోలు, వేమూరు ఏప్రిల్ 12

బాపట్ల జిల్లాలో రేషన్ బియ్యం మాఫియా పక్కదారి పడుతున్నప్పటికీ, సంబంధిత విజిలెన్స్ సివిల్ సప్లై అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**నిఘా లోపం**

ప్రతి నెలా 5 నుండి 15వ తేదీ మధ్య భారీగా రేషన్ బియ్యం నల్లబజారుకు తరలుతున్నాయని, రాత్రి సమయాల్లో గస్తీ కాసే పోలీసులకు గానీ, విజిలెన్స్ అధికారులకు గానీ ఇవి కనిపించకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**మాఫియా నెట్‌వర్క్.**

అక్రమార్కులు కార్డుదారుల నుండి కిలో ?08 నుండి ?10 చొప్పున కొనుగోలు చేసి, ప్రైవేట్ గోదాములల్లో నిల్వఉంచుతున్నారు. ఆ తర్వాత రాత్రి వేళల్లో వీటిని పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

**అధికారుల మౌనం:**

ఈ అక్రమ రవాణా వ్యవస్థీకృతంగా జరుగుతున్నా, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల నుండి సరైన స్పందన లేదని, దీని వెనుక అధికారుల పరోక్ష సహకారం లేదా లంచాల ప్రమేయం ఉందనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇటీవలి చర్యలు అక్కడక్కడా అధికారులు దాడులు నిర్వహిస్తున్నా, అవి నామమాత్రంగానే ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి.

**బాపట్లలో సీజ్**

గతంలో బాపట్ల జిల్లాలో సుమారు 200 బస్తాల అక్రమ రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.విజిలెన్స్ అధికారులు కొన్ని రైస్ మిల్లులపై దాడులు చేసి అక్రమ నిల్వలను గుర్తిస్తున్నారు,

## మత్తు వదలరా..
## భవిష్యత్తు చెడగొట్టుకోకరా.!

**పొన్నూరులో డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ యాత్ర హోరు.**





పొన్నూరు ఏప్రిల్ 13 **వివేక సమయం** (ప్రతినిధి)
గుంటూరు జిల్లా,పొన్నూరు క్షణం ఇచ్చే కిక్కు కోసం జీవితాంతం నరకం అనుభవించొద్దని,మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేశ్ బాబు యువతకు పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రగ్స్ వద్దు బ్రో రాష్ట్రవ్యాప్త సైకిల్ యాత్ర సోమవారం పొన్నూరు పట్టణానికి చేరుకుంది.తిరుపతి నుంచి విశాఖపట్నం వరకు వేలాది కిలోమీటర్ల లక్ష్యంతో సాగుతున్న ఈ యాత్రకు పట్టణ సరిహద్దుల్లో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ రమేశ్ బాబు పాల్గొని,డ్రగ్స్ మహమ్మారిపై ఘాటుగా స్పందించారు.
కమిషనర్ మాట్లాడుతూజీవితం ముఖ్యం, వ్యసనం కాదు, ఒక్కసారి మత్తుకు బానిసలైతే అది ప్రాణాలను తీయడమే కాకుండా,కన్నవారి కలలను, నమ్ముకున్న కుటుంబాన్ని రోడ్డున పడేస్తుందని హెచ్చరించారు.
మత్తు పదార్థాల మాఫియా చిగురుటాకుల్లాంటి యువతను లక్ష్యంగా చేసుకుంటోందని, అప్రమత్తంగా ఉండకపోతే జీవితం చిన్నాభిన్నం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆరోగ్యకర సమాజం మన బాధ్యత,శారీరక, మానసిక దృఢత్వాన్ని దెబ్బతీసే మత్తు పదార్థాలను సమాజం నుంచి తరిమికొట్టాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో సైనికుల్లా పని చేయాలని కమిషనర్ కోరారు.
తిరుపతిలో ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర దారిపొడవునా గ్రామాల్లో, పట్టణాల్లో విద్యార్థులకు, యువతకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ సాగుతోంది. పొన్నూరులో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వద్దు బ్రో అంటూ నినదించారు.క్షణికానందం కోసం జీవితాలను బలిపీఠం ఎక్కించవద్దని, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడమే ఈ యాత్ర అంతిమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## ఇకపై నిధి పోర్టల్ ద్వార ఆపెన్షన్ల పంపిణీ

అమరావతి,ఏప్రిల్13 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ల మంజూరు పక్రియలో పారదర్శకతను పెంచేందుకు, జాప్యాన్ని తగ్గించేందుకు మరో కీలక అడుగు వేసింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని రకాల పెన్షన్ కేసులను నిధి పోర్టల్ ద్వారా మాత్రమే ప్రాసెస్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిజికల్ అప్లికేషన్లకు స్వస్తి చెప్పి, మే 1 నుంచి ఈ కొత్త రూల్ అమలు చేయబోతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కాగితపు దరఖాస్తుల విధానానికి ప్రభుత్వం గడువు విధించింది. ఏప్రిల్ 30, 2026 వరకు అందిన ఫిజికల్ పెన్షన్ ప్రపోజల్స్‌ను మాత్రమే అధికారులు అంగీకరిస్తారు. మే 1, 2026 నుంచి ఎటువంటి పేపర్ అప్లికేషన్లను స్వీకరించబోమని ప్రభుత్వం చెప్పింది. ఆ తేదీ తర్వాత వచ్చే పెన్షన్ దరఖాస్తులన్నీ తప్పనిసరిగా నిధి పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వివిధ శాఖల్లో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఫిజికల్ దరఖాస్తులన్నింటినీ ఏప్రిల్ 30లోపు సంబంధిత కార్యాలయాలకు సమర్పించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పెన్షన్ ప్రాసెసింగ్‌లో వేగం పెంచడమే లక్ష్యంగా తెచ్చిన ఈ డిజిటల్ విధానం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయి. ÷ల్ ఏ స్టేజ్‌లో ఉందో అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే తెలుసుకోవచ్చు. కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, డిజిటల్ పద్ధతిలో వేగంగా ఆమోదం పొందే అవకాశం ఉంటుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారులకు సేవలు అందుతాయి. ఈ కొత్త విధానంపై అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులకు, జిల్లా అధికారులకు ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఉద్యోగులు పదవీ విరమణ పొందే ముందే వారి పెన్షన్ పేపర్లను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు మేలు చేకూరనుంది. పెన్షన్ మంజూరులో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను తొలగించి, సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశం.

## డేటా వినియోగంపై బాబు ప్రత్యేక దృష్టి

అమరావతి,ఏప్రిల్13**వివేక సమయం** (ప్రతినిధి) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ (సమావేశం జరిగింది. వెలగపూడి సచివాలయంలోని ఆర్‌టిజిఎస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో డేటా డ్రివెన్ డిసిషన్ మేకింగ్‌పై ఉన్నతస్థాయి చర్చ జరిగింది. పాలనలో డేటా వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం, రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ పనితీరును సమీక్షించారు. ముఖ్య శాఖల కార్యదర్శులతో పాటు ÷నాన్స్, ఎ÷-లానింగ్, వెల్ఫేర్ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డేటా లేక్ నిర్మాణం, టెక్నాలజీ వినియోగం, డేటా అనలిటిక్స్ ద్వారా నిర్ణయాలు తీసుకునే విధానాలపై చర్చించారు.
పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. వివిధ సంస్థల ప్రతినిధులతో పాటు డిజిటల్ కార్పొరేషన్, ట్రికోర్, వాసర్ ల్యాబ్స్ ప్రతినిధులు కూడా సమావేశంలో హాజరయ్యారు. అన్న క్యాంటీన్ ట్రస్ట్, గ్రామ-వార్డు సచివాలయాల అధికారులు కూడా పాల్గొన్నారు. డేటా అనలిటిక్స్ ఆధారంగా నిర్ణయాలు తీసుకునే దిశగా చర్యలు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. అలాగే సంబంధిత అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు.

## జిల్లాలో ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, నాణ్యమైన సేవలు అందించే దిశగా చర్యలు చేపట్టాలి.

**- ప్రజా సమస్యలకు ఇచ్చే పరిష్కారం అర్జీదారులకు పూర్తిగా సంతృప్తి చెందే విధంగా ఉండాలి**
**- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**



భీమవరం ఏప్రిల్ 13**వివేక సమయం** (ప్రతినిధి) కలెక్టరేట్ పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.ఆర్.ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా స్వర్ణ గ్రామం ఉ స్వర్ణ వార్డు అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కె.సి.హెచ్. అప్పారావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువ, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, తదితర అధికారులు పాల్గొని, జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఈరోజు పి.జి.ఆర్.ఎస్‌లో 160 అర్జీలు, రెవెన్యూ క్లినిక్‌లో 38 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, అధికారులు అందిన ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా వ్యవహరించి, నిర్ణీత గడువులోపుగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారం నాణ్యతతో ఉండి, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సమస్యను లోతుగా అర్థం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రతి సోమవారం పి.జి.ఆర్.ఎస్ మరియు రెవెన్యూ క్లినిక్‌లో అందిన అర్జీలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అందిన ఫిర్యాదులు కొన్ని ఇలా ఉన్నవి,కాళ్ల మండలం బొండాడ గ్రామానికి చెందిన మందపాటి వెంకటేశ్వర్లు తన కుమారుడు తనను ఇంటి నుండి వెళ్లగొట్టాడని, తన భూమిని తిరిగి ఇప్పించి నివాసానికి అవకాశం కల్పించాలని కోరారు.
రాయలం వినాయకుడి గుడి తోట ప్రాంత నివాసితులు విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గుల వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని, హై వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు.అత్తిలి మండలం ఊరదాల పాలెం గ్రామానికి చెందిన ఊరదళ్ళ సుబ్బారావు వీధులు ఇరుకుగా మారుతున్న నేపథ్యంలో ప్రహరీ గోడల నిర్మాణాలను తొలగించాలని కోరారు.పాలకోడేరు మండలం గరగపర్రుకు చెందిన పాల పెద్దింట్లు వితంతు పింఛను మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంపైర్ తీరు పట్ల రోహిత్ శర్మ తీవ్ర అసహనం



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 కీలక దశకు చేరుకుంది. ఆదివారంతో ప్రతి జట్టు కూడా నాలుగేసి మ్యాచ్‌లను ఆడేశాయి. ఇక ఆదివారం డబుల్ హెడర్స్ జరిగింది. మధ్యాహ్నం జరిగిన పోరులో లక్నో సూపర్ జెయింట్స్‌పై గుజరాత్ టైటాన్స్ నెగ్గగా.. రాత్రి జరిగిన హై స్కోరింగ్ పోరులో ముంబై ఇండియన్స్‌పై ఆర్సీబీ ఘనవిజయం సాధించింది. ముంబై ఇండియన్స్‌కు ఇది హ్యాట్రిక్ ఓటమి కావడం విశేషం. ఇక మ్యాచ్ సమయంలో రోహిత్ శర్మకు కోపం వచ్చింది. అది కూడా అంపైర్‌పై. తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఆ తర్వాత మ్యాచ్ ఆడుతూ గాయపడ్డాడు కూడా. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 4 వికెట్లకు 240 పరుగులు చేసింది. అనంతరం ముంబై ఇండియన్స్ ఛేజ్‌కు దిగే సమయంలో అంపైర్లు బ్యాటర్ల బ్యాట్‌లను చెక్ చేశారు. ఈ క్రమంలో రోహిత్ శర్మ బ్యాట్‌ను చెక్ చేసే సమయంలో చెకింగ్ పరికరం బ్యాట్ మధ్యలో స్టక్ అయ్యింది. ఆ పరికరం.. బ్యాట్ ఒక ఎండ్ నుంచి మరొక ఎండ్‌కు ఆగకుండా వెళ్లాలి. కానీ, రోహిత్ శర్మ బ్యాట్‌ను చెక్ చేసే సమయంలో చెకింగ్ పరికరం ఇరుక్కుపోయింది. పలుమార్లు అంపైర్ బలంగా పరికరాన్ని నెట్టే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ అది వెళ్లలేదు. దాంతో అసహనానికి గురైన రోహిత్ శర్మ.. మీరు తప్పుగా పెడుతున్నారంటూ అంపైర్‌కు సూచించాడు. చివరకు డ్రెస్సింగ్ రూం నుంచి తిలక్ వర్మ వచ్చి చెకింగ్ పరికరంతో బ్యాట్‌ను చెక్ చేయగా.. అప్పుడు పరికరం ఒక ఎండ్ నుంచి మరొక ఎండ్‌కు వెళ్లి వచ్చింది. ఈ క్రమంలో తిలక్ వర్మ కూడా అంపైర్‌కు ఏదో చెబుతాడు. బహుశా ఎందుకు ఆ పరికరం ఇరుక్కుపోయిందనే దానిపై వివరణ ఇచ్చినట్లున్నాడు. అయితే దీనిపై అభిమానుల్లో భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. పక్కన ఉన్న రికెల్టన్ బ్యాట్‌ను చెక్ చేసినపుడు చెకింగ్ పరికరం సులభంగా కదిలింది కదా.. రోహిత్ బ్యాట్ విషయంలో ఎందుకు కదల్లేదంటూ కామెంట్స్ పెడుతున్నారు. రూల్స్ అందరికీ ఒకేలా ఉండాలంటున్నారు. రోహిత్ బ్యాట్ విషయంలో ఏదైతే జరిగిందో అది వేరే ప్లేయర్‌కు జరిగి ఉంటే బ్యాట్ మార్చాలని అంపైర్లు తెగేసి చెప్పేవారని కానీ, అక్కడ రోహిత్ కాబట్టి అతడు ఏమన్నా పడాల్సి వస్తుందని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. క్రికెట్‌కు ఇది మంచిది కాదని.. రూల్స్ విషయంలో అక్కడ ధోని ఉన్నాడా? లేదంటే కోహ్లీ ఉన్నాడా.. రోహిత్ ఉన్నాడా? అని చూడరాదని.. అందరినీ ఒకేలా ట్రీట్ చేయాలంటూ కామెంట్స్ చేస్తున్నారు. బ్యాట్ క్లియరెన్స్ వచ్చిన తర్వాత రోహిత్ శర్మ క్రీజులో మెరుపులు మెరిపించలేకపోయాడు. 13 బంతుల్లో 19 పరుగులు చేశాడు. అనంతరం రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. బ్యాటింగ్ చేస్తూ రోహిత్ శర్మ తొడ కండరాల గాయంతో ఇబ్బంది పడ్డాడు. ఫిజియోల సాయంతో బ్యాటింగ్ కొనసాగించే ప్రయత్నం చేసినా.. తీవ్ర నొప్పితో విలవిలలాడాడు. దాంతో అతను రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దాంతో 57 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి బ్రేక్ పడింది.

# హార్ధిక్ పాండ్యకు లక్షల్లో జరిమానా..





వాంఖడే స్టేడియంలో ఆదివారం జరిగిన పోరులో ముంబై ఇండియన్స్ జట్టు అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. ప్రస్తుత సీజన్‌లో 20వ మ్యాచ్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడిన ముంబై, 22 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. గతేడాది విజేతగా నిలిచిన బెంగళూరు జట్టు అద్భుత ప్రదర్శనతో ఈ సీజన్‌లో తన మూడవ విజయాన్ని నమోదు చేయగా, ముంబైకి ఇది వరుసగా మూడవ పరాజయం. సొంత మైదానంలో ఎదురైన ఈ ఓటమి జట్టు ప్రతిష్టను మసకబార్చింది. ఈ ఘోర పరాజయం తర్వాత కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు మరో చేదు వార్త అందింది. నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయడంలో విఫలమైనందుకు (స్లో ఓవర్ రేట్) భారత క్రికెట్ నియంత్రణ మండలి అతనిపై కఠిన చర్యలు తీసుకుంది. ఐపీఎల్ క్రమశిక్షణ నియమావళి ప్రకారం, ఒక మ్యాచ్‌లో ఓవర్ల వేగాన్ని పాటించకపోతే జట్టు కెప్టెనే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ మేరకు హార్దిక్ పాండ్యాకు 12 లక్షల రూపాయల జరిమానా విధిస్తున్నట్లు నిర్వాహకులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. కేవలం ఓటమి మాత్రమే కాకుండా, హార్దిక్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు కూడా విమర్శలకు దారితీశాయి. అనుభవజ్ఞుడైన బౌలర్ శార్దూల్ ఠాకూర్‌ను పది ఓవర్ల తర్వాత రంగంలోకి దించడంపై క్రీడా విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. శార్దూల్ తన మొదటి ఓవర్‌లోనే వికెట్ తీసి సత్తా చాటినప్పటికీ, అతనికి ఆలస్యంగా బౌలింగ్ ఇవ్వడం వల్ల ప్రత్యర్థి జట్టు భారీ స్కోరు సాధించే అవకాశం లభించింది. సోషల్ మీడియాలో సైతం అభిమానులు హార్దిక్ కెప్టెన్సీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్ నిబంధనల ప్రకారం, పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో 20 ఓవర్లను ఒక నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలి. ఒకవేళ నిర్ణీత సమయం దాటినప్పటికీ ఓవర్లు పూర్తి కాకపోతే, అది క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా పరిగణిస్తారు. ఆదివారం నాటి మ్యాచ్ ముగియడానికి సాధారణం కంటే ఎక్కువ సమయం పట్టడంతో ప్రేక్షకులు కూడా ఇబ్బంది పడ్డారు. అందుకే తొలి తప్పుగా పరిగణిస్తూ హార్దిక్‌కు ఈ జరిమానా విధించారు.

# మహిళల టీ20 వరల్డ్ కప్ రికార్డ్ స్థాయిలో ప్రైజ్?మనీ




మహిళల క్రికెట్ చరిత్రలో మరో అద్భుతమైన ఫైట్ జరగనుంది. కేవలం 60 రోజుల్లో ఇంగ్లాండ్, వేల్స్ వేదికలుగా ప్రారంభం కానున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (×జజ) ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ఈసారి టోర్నీలో పాల్గొనే జట్ల కోసం రికార్డ్ స్థాయిలో ప్రైజ్ మనీని ప్రకటించింది. మహిళల క్రీడలకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో, పురుషుల క్రికెట్‌తో సమానంగా పెట్టుబడులు పెట్టాలనే ఉద్దేశంతో ఐసీసీ ఈ అడుగు వేసింది. ప్రైజ్ మనీ పెంచడమే కాకుండా, టోర్నీని మరింత విస్తృతం చేస్తూ జట్ల సంఖ్యను కూడా పెంచడం విశేషం. ఈ నిర్ణయం మహిళా క్రికెటర్ల ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేయడమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఈ క్రీడకు కొత్త ఊపునివ్వబోతోంది. ఐసీసీ ప్రకటించిన వివరాల ప్రకారం, 2026 మహిళల టీ20 ప్రపంచకప్ మొత్తం ప్రైజ్ పూల్ విలువను 8,764,615 డాలర్లకు (సుమారు రూ. 73.4 కోట్లు) పెంచారు. ఇది 2024 ఎడిషన్‌తో పోలిస్తే 10 శాతం ఎక్కువ. గతంలో 10 దేశాలు పాల్గొన్న టోర్నీలో 7,958,077 డాలర్ల ప్రైజ్ మనీ ఉండేది. ఇప్పుడు జట్ల సంఖ్య 12కి పెరగడంతో బహుమతి మొత్తాన్ని కూడా ఐసీసీ భారీగా పెంచింది. క్రికెట్ రంగంలో మహిళా అథ్లెట్ల ప్రభావం పెరుగుతోందని, అందుకే పెట్టుబడులను కూడా అదే స్థాయిలో పెంచుతున్నామని ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ మెగా టోర్నీలో ట్రోఫీని ముద్దాడే జట్టుకు భారీ నగదు బహుమతి దక్కనుంది. విజేతగా నిలిచిన టీమ్ 2,340,000 డాలర్ల (సుమారు రూ. 19.5 కోట్లు) ప్రైజ్ మనీని సొంతం చేసుకుంటుంది. అలాగే రన్నరప్‌గా నిలిచిన జట్టుకు 1,170,000 డాలర్లు (సుమారు రూ. 9.7 కోట్లు) అందజేస్తారు. సెమీఫైనల్‌లో ఓడిపోయిన రెండు జట్లకు చెరో 675,000 డాలర్లు (సుమారు రూ. 5.6 కోట్లు) దక్కుతాయి. ప్రతి గ్రూప్ స్టేజ్ మ్యాచ్ గెలిస్తే అదనంగా 31,154 డాలర్లు (సుమారు రూ. 26 లక్షలు) ఇస్తారు. టోర్నీలో పాల్గొనే ప్రతి జట్టుకు కనీసం రూ. 2 కోట్ల ప్రైజ్ మనీని ఐసీసీ గ్యారెంటీ ఇచ్చింది. ఐసీసీ తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలు మహిళా క్రికెట్ ఎదుగుదలకు ఎంతో అవసరం. ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా మరికొంత మంది యువతులకు ఈ క్రీడ వైపు వచ్చేలా ప్రోత్సహించవచ్చు. మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలో మొదటిసారిగా 12 జట్లు తలపడబోతున్నాయి. గతంలో కేవలం 10 జట్లు మాత్రమే మెగా టోర్నీలో పోటీ పడేవి. జట్ల సంఖ్య పెరగడం వల్ల టోర్నీ మరింత రసవత్తరంగా మారనుంది. ఆతిథ్య దేశం ఇంగ్లాండ్‌తో పాటు శ్రీలంక, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇండియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్, స్కాట్లాండ్, దక్షిణాఫ్రికా అలాగే వెస్టిండీస్ జట్లు ఈ పోరులో నిలవనున్నాయి. మొత్తం 24 రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో 7 వేదికల్లో 33 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఇది మహిళల క్రికెట్‌ను మరింత గ్లోబల్ స్పోర్ట్‌గా మార్చడానికి దోహదపడుతుందని ఐసీసీ భావిస్తోంది. వరల్డ్ కప్ ప్రైజ్ మనీ ప్రకటనతో పాటే ఐసీసీ ట్రోఫీ టూర్ కూడా వైభవంగా మొదలైంది.

లండన్‌లోని చారిత్రాత్మక లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా ఈ టూర్ ప్రారంభమైంది. మొదటిసారిగా లార్డ్స్ పెవిలియన్‌పై ట్రోఫీ ఆకారాన్ని ప్రొజెక్ట్ చేసి సరికొత్తగా ఆవిష్కరించారు. బర్మింగ్‌హామ్,

బ్రిస్టల్ వంటి ప్రధాన నగరాల్లో అభిమానులకు ఈ ట్రోఫీని చూసే అవకాశం కల్పిస్తారు. ఇది టోర్నీపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచడానికి సహాయపడుతుంది. ఈ మెగా టోర్నీ జూన్ 12న బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ప్రారంభం కానుంది.

# విరాట్ పై బీసీసీఐ యాక్షన్ తీసుకుంటుందా?



ఐపీఎల్ 2026లో భాగంగా వాంఖడే స్టేడియంలో ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఘనవిజయం సాధించింది. అయితే ఈ గెలుపు కంటే ఎక్కువగా విరాట్ కోహ్లీ ప్రవర్తన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్‌లో 50 పరుగులతో మెప్పించిన కోహ్లీ, ఔటైన తర్వాత తన కోపాన్ని ఆపుకోలేకపోయారు. పెవిలియన్‌కు వెళ్లే క్రమంలో అతను చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. ఇది కేవలం కోపమేనా లేక ఐపీఎల్ నిబంధనల ఉల్లంఘనా అనే చర్చ మొదలైంది. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బీసీసీఐ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ముంబయి ఇండియన్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ 38 బంతుల్లో 50 పరుగులు చేశారు. హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో సూర్యకుమార్ యాదవ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగారు. అయితే తన ఆట తీరు పట్ల అసంతృప్తిగా ఉన్న కోహ్లీ, బౌండరీ లైన్ దాటిన తర్వాత తన గ్లోవ్స్ హెల్మెట్‌ను కోపంతో నేలకేసి విసిరేశారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. సాధారణంగా అగ్రెసివ్‌గా ఉండే కోహ్లీ, ఇలా క్రీడా సామగ్రిని విసిరేయడం ఐపీఎల్ నిబంధనల ప్రకారం నేరంగా పరిగణించబడుతుంది. కోహ్లీ ప్రవర్తన ఇప్పుడు క్రమశిక్షణా చర్యలకు దారితీసేలా కనిపిస్తోంది. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ఆటగాళ్లు మైదానంలో సంయమనం పాటించాలి. కోహ్లీ గ్లోవ్స్ హెల్మెట్ విసిరేయడం ఆర్టికల్ 2.2 నిబంధనలను ఉల్లంఘించినట్లు అవుతుంది. ఒకవేళ మ్యాచ్ రిఫరీ దీనిని తీవ్రంగా పరిగణిస్తే విరాట్‌పై జరిమానా విధించే అవకాశం ఉంది. గతంలో కూడా పలువురు ఆటగాళ్లు ఇలాంటి పనులు చేసి జరిమానాలు ఎదుర్కొన్నారు. స్టార్ ప్లేయర్ అయినంత మాత్రాన నిబంధనల నుంచి మినహాయింపు ఉండదు కాబట్టి బీసీసీఐ దీనిపై విచారణ జరిపే అవకాశం ఉంది. ఐపీఎల్ నిబంధనావళిలోని ఆర్టికల్ 2.2 ప్రకారం క్రికెట్ పరికరాలను, దుస్తులను లేదా మైదానంలోని వస్తువులను దుర్వినియోగం చేయడం నేరం. వికెట్లను తన్నడం, అడ్వర్టైజింగ్ బోర్డులను కొట్టడం, డ్రెస్సింగ్ రూమ్ తలుపులను బాదడం వంటి చర్యలు ఇందులోకే వస్తాయి. కోహ్లీ హెల్మెట్ విసిరేయడం కూడా 'అబ్యూస్ ఆఫ్ క్రికెట్ ఎక్విప్‌మెంట్' కిందికే వస్తుంది. ఇది లెవల్ 1 నేరంగా పరిగణించబడుతుంది.

ఇలాంటి పనులు చేసినందుకు ఆటగాళ్లకు హెచ్చరికలతో పాటు జరిమానా కూడా విధిస్తారు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం లెవల్ 1 నేరం రుజువైతే సదరు ఆటగాడికి మ్యాచ్ ఫీజులో 10 శాతం నుంచి 25 శాతం వరకు జరిమానా పడే అవకాశం ఉంది. అంతేకాకుండా ఒక డెమెరిట్ పాయింట్‌ను కూడా కేటాయిస్తారు. కోహ్లీ వీడియో ఆధారంగా రిఫరీ చర్యలు తీసుకుంటే మ్యాచ్ ఫీజులో కోత పడటం ఖాయంగా కనిపిస్తోంది. సాధారణంగా ఇలాంటి విషయాల్లో మ్యాచ్ రిఫరీదే అంతిమ నిర్ణయం. కోహ్లీ ఉద్దేశపూర్వకంగా చేశారా లేక ఆవేశంలో జరిగిందా అనే కోణంలో విచారణ జరగనుంది.

వివాదాల సంగతి పక్కన పెడితే, ఇదే మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఒక అరుదైన రికార్డును చేరుకున్నారు. ముంబయి ఇండియన్స్‌పై ఐపీఎల్, ఛాంపియన్స్ లీగ్ కలిపి 1000 పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా కోహ్లీ రికార్డు సృష్టించారు. ఈ మ్యాచ్‌కు ముందు అతనికి 20 పరుగులు అవసరం కాగా, కేవలం 11 బంతుల్లోనే ఆ మార్కును చేరుకున్నారు. ప్రస్తుతం ముంబయిపై కోహ్లీ ఖాతాలో 1030 పరుగులు ఉన్నాయి. కేఎల్ రాహుల్ (977), శిఖర్ ధావన్ (901) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. తన ఫేవరెట్ టీమ్‌పై కోహ్లీ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు. మరోవైపు ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ 18 పరుగుల తేడాతో విజయం సాధించి పాయింట్ల పట్టికలో మూడవ స్థానానికి చేరుకుంది. ఫిలిప్ సాల్ట్, విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్ అర్ధశతకాలతో రాణించడంతో ఆర్సీబీ 240 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముంబయి ఆటగాళ్లు పోరాడినా లక్ష్యం పెద్దది కావడంతో ఓటమి తప్పలేదు. ఆర్సీబీకి ఇది మూడవ విజయం కావడం విశేషం.

## సంపాదకీయం




# అంబేడ్కర్ ఆశయాలకు పట్టం కట్టాలి !

అంబేడ్కర్ మహాశయుడు ఈ దేశం గురించి గొప్పగా కలలు కన్నారు. తన దేశాన్ని ఉన్నతంగా చూడాలను కున్నారు. అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించడంతో పాటు, అందరికీ విద్య దక్కాలన్న ఆశయం ఆయనది. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమ న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సౌర్వభౌమాధి కారాన్ని దక్కించుకొనేందుకు వీలుగా అంబేద్కర్ రాజ్యంగాన్ని రూపొందించారు. వివిధ రకాల భాషలు, ఆచారాలు, మతాలూ ఉన్నటువంటి ఈ దేశంలో ఆయన ముందు చూపుతో రాసిన రాజ్యాంగం అనుసరించి ఇప్పుడు మన దేశం నడుస్తుంది అంటే ఆయన గొప్పతనం ఏంటో అర్థం అవుతుంది. ఆయన కేవలం దళితుల కోసమో లేక వాళ్ళ రిజర్వేషన్ ల కోసమో మాత్రమే కృషి చేయలేదు. ఆడవాళ్ళకి మగవాళ్ళకి సమానమైన జీతాలు ఉండాలని, ఆడవాళ్ళకి ప్రెగ్నెన్సీ టైం లో లీవ్స్ ఇవ్వాలని, పని గంటల సమయాన్ని 12 నుండి 8 గంటలు చేయాలనీ, స్త్రీలకూ ఆస్తి హక్కు ఇవ్వాలని ఇలా ఎన్నో అంశాలలో ఈయన కృషి చేసారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని యావత్ భారతావని ఆయన ఆశయాలపై ఇప్పటికైనా అధ్యయనం చేయాలి. ఎంతసేపు అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహాలు పెట్టడం, సభలు పెట్టడం కాదు. ఆయన దేశానికి అందించిన విలువైన సూచనలు పాటించలి. ఆయన కోరుకున్న సమాజం కోసం పాలకులు ఆలోచన చేయాలి. అందుకు నడుం బిగించాలి. జయంతి సభల్లో ఉపన్యాసాలు ఇవ్వడం మానాలి. ఒకానొక సమయంలో అంటరానితనం పేరు తో అట్టడుగు వర్గాల ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉండేదన్నది ఆయన జీవితమే పెద్ద ఉదాహరణ. అప్పటి వరకు మూగ బోయిన అణగారిన ప్రజలకు గొంతుకయ్యాడు. అయితే కొందరు రాజకీయంగా ఆయనను ఎదగకుండా చేశారు. స్వాతంత్ర్యం రాగానే నెహ్రూ బదులు అండేబ్కర్‌ను ప్రధానిని చేసివుంటే మనదేశ రాత మరోలా ఉండేది. కానీ నెహ్రూ, గాంధీల కుట్రలకు ఆయన బలయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆర్థిక నిపుణుడు, దళితోద్దారకుడు, మహా మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇలా ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే నేమో ఆయనను ఆనాటి నేతలు దూరం పెట్టారు. ఈనాటి నేతలు విగ్రహాలు పెట్టి, కేవలం చెక్క భజనలు చేస్తున్నారు. కానీ ఆయన స్వప్నించిన భారతాన్ని ఆవిష్కృతం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీన రాంజీ మాలోజి సక్పాల్ ,భీమాబాయ్ దంపతులకు మధ్యప్రదేశ్ లోని మావ్ గ్రామంలో మహర్ కులంలో అంబేద్కర్ జన్మించారు. అప్పట్లో ఈ కులం వారిని అంటరానివారిగా పరిగణిం చేవారు. దళితుడు అనే కారణంతో ఈయన చిన్న వయసు నుండే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. చిన్నప్పుడు వాళ్ళ అన్నయ్యతో కలిసి వేరే ఊరుకి నడిచి వెళ్తుంటే బాగా దాహం వేయడంతో దగ్గరలో ఉన్న ఒక ఇంటికి వెళ్లి తాగడానికి నీటిని అడిగితే అంబేద్కర్ మహర్ కులానికి చెందిన వారు అని తెలిసి నీళ్లు ఇవ్వకపోగా, పక్కనే ఉన్న మురికి గుంటలో నీటిని తాగమని తిట్టి పంపించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి అనేక అవమానాలను అంబేద్కర్ ఎదుర్కొన్నారు. అందుకే ఇలాంటి వ్యవస్తను నిరసించాడు. అలాగని మిగతా కులాల వారిని ఏనాడూ ఆయన ఈసడించుకోలేదు. ఇది వ్యవస్తాగతమైన లోపంగా గుర్తించారు. తన ఆలోచనలను రాజ్యాంగ రచనలో చూపారు. భారత దేశం ఉన్నతంగా ఉండాని కోరుకున్నాడు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పారు. కానీ వారెవ్వరూ అంబేద్కర్‌ను లెక్కచేయలేదంటే, ఆయన పట్ల వారికి గల ప్రేమానురాగాలు ఏపాటివో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. అమెరికాలో మొదటి సారిగా అంబేద్కర్ స్వేచ్ఛ అంటే ఏంటో చూసారు. అప్పుడు భారత దేశంలో ఉన్నట్టుగా కుల, జాతి వివక్షత లేదు. అందరికి సమానమైన గౌరవం, అవకాశాలు దక్కేవి. 1917 లో అంబేద్కర్ వెనక్కి వచ్చి ఒప్పందం ప్రకారం బరోడా సంస్థానంలో రక్షణశాఖలో ఉద్యోగంలో చేరారు.క్కడ ఆయనకి ఒక గొప్ప అధికారిగా ఉద్యోగం దక్కింది కానీ ఈయన నిమ్న కులస్తుడు కావడంతో ఆయన కింద ఉండే ఉద్యోగులు కూడా ఆయనని గౌరవించే వారు కాదు. ఏదైనా ఒక ఫైల్ ఇవ్వాలంటే దూరం నుండే ఆయన టేబుల్ మీదకు విసిరేసేవారు. చదవాలన్న, పని చేయాలన్న, ఉండడానికి ఇల్లు కావాలన్నా, చివరికి నీళ్లు తాగాలన్న కూడా కులం అడ్డు వచ్చేది. ఉద్యోగం చేసుకుంటూనే 1927 నుండి అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం మొదలు పెట్టాడు. ఇలా మహద్ లో దళితుల మహా సభని ఏర్పాటు చేసారు. దేశంలో నలుమూలల నుండి కొన్ని వేళ మంది దళితులు ఆ సభకు హాజరయ్యారు. అప్పటివరకు దళితులు మహద్ లోని చెరువులో నీటిని తాగడానికి అనుమతి ఉండేది కాదు.

# మరోమారు ఎదురు కాల్పులు

మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి
అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్

రాయ్‌పూర్,ఏప్రిల్13 ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు కమాండర్ రూపీ మృతి చెందారు. కాంకేర్ జిల్లాలోని ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రూపీపై రూ.5 లక్షల బహుమతి ప్రకటించబడినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా, ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి.ఎన్‌కౌంటర్ అనంతరం రూపీ మృతదేహంతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో మరికొందరు మావోయిస్టులు దాగి ఉన్నారనే అనుమానంతో విస్తృతంగా గాలింపు కొనసాగుతోంది. గత నెలలో కూడా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే. ఎన్‌కౌంటర్ సమయంలో సుమారు పదిమంది మావోయిస్టులు అక్కడి నుంచి అడవుల్లోకి పారిపోయినట్లు సమాచారం. వారు దట్టమైన అటవీ ప్రాంతాన్ని ఉపయోగించి తప్పించుకున్నారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. వారిని గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగాయి. ఎన్‌కౌంటర్ అనంతరం ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. మరి కొంతమంది మావోయిస్టులు అటవీలో దాగి ఉండవచ్చనే అనుమానంతో ఆపరేషన్‌ను భద్రతా బలగాలు కొనసాగిస్తున్నాయి. మావోయిస్టుల కదలికలపై గత కొంతకాలంగా భద్రతా బలగాలు నిఘా పెంచాయి. వారికి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్‌ని చేపట్టినట్లు తెలుస్తోంది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ఆపరేషన్ జాగ్రత్తగా కొనసాగుతోంది. ఈ ప్రాంతం గతంలో కూడా మావోయిస్టు కార్యకలా పాలకు కేంద్రంగా ఉంది. తరచూ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరుగుతు న్నాయి. మావోయిస్టులు ఉద్యమం ప్రభావం ఈ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతోండటంతో భద్రతా సవాళ్లు నెలకొన్నాయి. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సమీప గ్రామాల్లో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటవీ ప్రాంతానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన మరికొంతమంది మావోయిస్టులను పట్టుకోవడానికి డ్రోన్ సర్వైలెన్స్, ప్రత్యేక కూంబింగ్ బలగాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఈ ఆపరేషన్ మరికొన్ని గంటలు లేదా రోజులు కొనసాగవచ్చని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. మాచపల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందడం, పలువురు తప్పించుకోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్‌లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయిల్ సమాలోచనలు
ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన

వాషింగ్టన్,ఏప్రిల్13 అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించే ందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది.


హర్మ్యూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు ఇరాన్‌పై పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ దాడులకు ట్రంప్ అంగీకరిస్తారా? లేదా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇరాన్ (ఎసజీని)ను నలువైపులా నిర్బంధించి, హర్మ్యూజ్ జలసంధిపై నియంత్రణ తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మిత్ర దేశాలతో కలిసి ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు భద్రత కల్పించే అంశంపై అమెరికా అధ్యక్షుడు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా ఇరాన్‌పై దాడులు సిద్ధమవు తున్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణ విషయంలో ట్రంప్ నిర్ణయం కోసం ఇజ్రాయెల్ ఎదురుచూస్తున్నట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే, ఈలోగా టెహ్రాన్ తమపై దాడి చేస్తే మాత్రం ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది.

ఇదిలా ఉండగా.. యూఎస్-ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ పోర్టుల నుంచి నౌకలు హోర్ముజ్ మీదుగా రాకపోకలు సాగించకుండా నేటి సాయంత్రం 7.30 (భారత కాలమానం ప్రకారం) నిర్బంధం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో పాటు ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్‌లు మళ్లీ దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ దాడులను ప్లాన్ చేస్తున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్మీ సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఇజ్రాయెల్ రక్షణ దళం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆదేశించారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత స్థాయిలో దాడులు చేసేందుకు ట్రంప్, ఆయన సలహాదారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధించి చర్చల్లో ప్రతిష్టంభనను తొలగించాలనేది యూఎస్ ప్రభుత్వం ఉద్దేశమని కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా నాటో దేశాలను కూడా రంగంలోకి దింపేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే హోర్ముజ్ మీదుగా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన విషయం తెలిసిందే.

హోర్ముజ్ జలాల్లోకి యూఎస్ యుద్ధ నౌకలు వస్తే దాడులు తప్పవని హెచ్చరించింది. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని తేల్చి చెప్పింది. యూఎస్ పెట్టిన అసమంజసమైన డిమాండ్స్ కారణంగానే చర్చల్లో పీటముడి పడిందని పేర్కొంది. అణు కార్యక్రమం వదులుకునే దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన హామీలు రాలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు.

# హోర్ముజ్‌పై ట్రంప్ వ్యాఖ్యలు

దిగ్బంధిస్తే తీవ్ర పరిణామాలు
ఘాటుగా హెచ్చరికలుచేసిన ఇరాన్



టెహ్రాన్, ఏప్రిల్13 హోర్ముజ్‌ను దిగ్బంధి స్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక లపై ఇరాన్ మరోసారి ఘాటుగా స్పందించింది. హోర్ముజ్ ఇప్పటికీ తమ నియంత్రణలోనే ఉందని పేర్కొంది. శత్రువులు ఏ చిన్న పొరపాటు చేసినా ప్రమాదం తప్పదని హెచ్చరించింది. అంతకుముందు ఇరాన్ సైనిక దళం (ఐఆర్‌జీసీ) కూడా ట్రంప్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. హోర్ముజ్ వైపు వచ్చే యుద్ధ నౌకలపై దాడి చేస్తామని హెచ్చరించింది. పౌర నౌకల రాకపోకలకు మాత్రం ఎలాంటి ఇబ్బందీ ఉండదని భరోసా ఇచ్చింది. యుద్ధ నౌకలు వస్తే మాత్రం కాల్పుల విరమణను ఉల్లంఘించినట్టేనని స్పష్టం చేసింది. ఇక యూఎస్‌తో చర్చలు విఫలం కావడంపై ఇరాన్ మంత్రి అరాగ్చీ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 47 ఏళ్ల తరువాత జరిగిన అత్యున్నత స్థాయి చర్చలకు తాము సదుద్దేశంతో వెళ్లామని చెప్పారు. ఒప్పందం అంగుళం దూరంలో ఉండగా యూఎస్ తన లక్ష్యాలను, ఉద్దేశాలను మార్చుకుందని ఆరోపించారు. మునుపటి అనుభవాల నుంచి ఎలాంటి గుణపాఠాలను అమెరికా నేర్చుకోలేదని అన్నారు. మంచి భావాలుంటే చివరకు మంచే జరుగుతుందని అన్నారు. మనసులో శత్రుత్వం ఉంటే తుదకు అదే మిగుల తుందని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. సోమవారం హోర్ముజ్‌లో నౌకల ట్రాఫిక్ స్తంభించిపోయిందని లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్ అనే మారిటైమ్ సంస్థ తాజాగా పేర్కొంది. హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న ట్రంప్ ప్రకటన తరువాత నౌకల రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొంది. ఎలాంటి ఒప్పందం లేకుండా ఇరాన్‌తో చర్చలు ముగియడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మాత్రం కొనసాగుతోందని అన్నారు. ఇరాన్ మళ్లీ చర్చలకు వస్తుందా? రాదా? అనేది తనకు ఇక అనవసరమని కూడా చెప్పారు. ఇప్పటికే ఇరాన్ పరిస్థితి దగజారిందని, మిలిటరీ ధ్వంసమైపోయిందని చెప్పారు. శాంతి చర్చలు విఫలమవడానికి అమెరికానే కారణమని ఇరాన్ ఆరోపించింది. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో ఇరాన్ చిత్తశు ద్ధితో సంప్రదింపులు చేసింది. కానీ, ఇస్లామాబాద్ ఒప్పందానికి కొన్ని అంగుళాల దూరంలోనే చర్చలు కుప్పకూలాయి. అతివాద భావజాలం, లక్ష్యాలు మారడం, నిర్బంధం వంటివి మాకు ఎదురయ్యాయి. మంచి చేస్తే మంచి జరుగుతుంది. చెడు చేయాలని చూస్తే శత్రుత్వమే మిగులుతుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పోస్ట్ చేశారు.

# వికసిత భారత్ లక్ష్య సాధనలో మినరల్స్ కూడా కీలకమే

మినరల్ రంగంలో ఆత్మనిర్భరత భారత్‌పై ప్రత్యేక దృష్టి
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్13: ప్రపంచవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్ ప్రాముఖ్యం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో మినరల్స్ కీలకమని చెప్పుకొచ్చారు. మినరల్ రంగంలో ఆత్మనిర్భరత సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్ఐసీసీలో భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2వ విడత ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ వేలం, 7వ విడత క్రిటికల్ / స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ వేలం కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. జియోపాలిటిక్స్, క్లైమేట్ మార్పు, ఆర్థిక భద్రతలో ఈ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 46 బ్లాక్స్ వేలం విజయవంతంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి వెల్లడించారు. 7వ విడతలో 19 బ్లాక్సల వేలం ప్రారంభమైందన్నారు. మినరల్ ఎక్స్‌ఎ÷-లోరేషన్ లైసెన్స్ మొదటి విడత ప్రారంభమైందని.. త్వరలోనే 11 బ్లాక్సలకు రెండో విడత లైసెన్స్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో 2 వెనేడియం, టైటానియం బ్లాక్స్ సిద్ధం చేసినట్లు మంత్రి ప్రకటించారు. మైనింగ్ కార్యకలాపాలను వేగవంతం చేయడం కోసం చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలు స్వతంత్రంగా వేలం నిర్వహించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు.

పర్యావరణ అనుమతుల పక్రియను సరళీకరించడం, 24 మినరల్స్‌పై కస్టమ్స్ డ్యూటీ రద్దు చేయడం, త్వరగా ఉత్పత్తి ప్రారంభించే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడం వంటి చర్యలు తీసుకోనున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. స్క్రాప్ నుంచి మినరల్స్ రీసైక్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. విదేశాల్లో మైనింగ్ ప్రయత్నాలు చేపట్టామని తెలిపారు. రక్షణ రంగం, ఎలక్ట్రిక్ వెహికల్స్, గ్రీన్ ఎనర్జీకి క్రిటికల్ మినరల్స్ కీలకమని.. ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌ను గ్లోబల్ మైనింగ్ లీడర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.




## హోర్ముజ్ దిగ్బంధనం కొనసాగితే.. ముడి చమురు ధర 150 డాలర్లకు చేరుతుందా..

అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ చమురు మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. ముఖ్యంగా హోర్ముజ్ సముద్ర మార్గాన్ని బ్లాక్ చేస్తామని డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం తీవ్ర ఆందోళనలకు కారణమవుతోంది. క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 100 డాలర్ల దిగువకు వచ్చేసింది

డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించినట్టు హోర్ముజ్‌ను పూర్తిగా దిగ్బంధిస్తే క్రూడాయిల్ బ్యారెల్ ధర 150 డాలర్లకు చేరే ప్రమాదం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఇరాన్‌కు టోల్ ఫీజ్ చెల్లించే ఏ నౌకనూ హోర్ముజ్‌లో ప్రయాణించనివ్వొద్దని తమ నౌకాదళాన్ని ఆదేశించినట్టు ట్రంప్ ఇప్పటికే తెలిపారు. మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఏ సైనిక నౌక అయినా హోర్ముజ్‌లోకి ప్రవేశిస్తే దాడి చేస్తామని ఐఆర్‌జీసీ హెచ్చరించింది (ఎశీతీఎబఓ ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర ప్రస్తుతం 8 శాతం పెరిగి 103 డాలర్లకు చేరుకుంది

ఒకవేళ ట్రంప్ హెచ్చరికలు కార్యరూపం దాల్చితే బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 150 డాలర్లకు చేరువ అవుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ట్రంప్ హెచ్చరిస్తున్నట్టు ఏ నౌకనూ హోర్ముజ్‌లోకి అనుమతించకపోతే రోజుకు 12 మిలియన్ బ్యారెళ్ల సరఫరా ప్రమాదంలో పడుతుంది. దీంతో చమురు ధరలు తారస్థాయికి చేరుకుంటాయి.

## క్రూడాయిల్ పైకి..
### స్టాక్ మార్కెట్లు కిందకి..




పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలు కావడంతో ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 103 డాలర్లకు చేరుకుంది. హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామని ట్రంప్ ప్రకటించడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు డీలాపడ్డాయి. మరోవైపు డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మరింత పతనమైంది. ఇన్ని వ్యతిరేకతల నేపథ్యంలో సోమవారం సూచీలు నష్టాలతో ప్రారంభమయ్యాయి. నష్టాలతోనే రోజును ముగించాయి

గత సెషన్ ముగింపు (76,794)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 1600 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. అయితే ఉదయం భారీ నష్టాలను చవి చూసిన సూచీలు మధ్యాహ్నం తర్వాత కాస్త కోలుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 702 పాయింట్ల నష్టంతో 76,847 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 207 పాయింట్ల నష్టంతో 23,842 వద్ద స్థిరపడింది

సెన్సెక్స్, నిఫ్టీలో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, ఎమ్‌సీఎక్స్ ఇండియా, వోల్టాస్, సోలార్ ఇండస్ట్రీస్, అదానీ పవర్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి (ఒష్ట్రుతీవ ఝతీనవ అవషం). ఐచర్ మోటార్స్, చోలా ఇన్వెస్ట్‌మెంట్, మారుతీ సుజుకీ, నిప్పాన్, ఏపీఎల్ ఆపోలో మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 307 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 330 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 93.38గా ఉంది.

# ఇంట్లో పనీర్ తయారు చేస్తున్నారా..?



ఇంట్లో పనీర్ తయారు చేయడం చాలా సులభమైన ప్రక్రియలా కనిపించినా, చాలా మందికి అది సరైన మృదుత్వంతో రాకపోవడం సాధారణ సమస్యగా మారుతుందని చెప్పవచ్చు. పాలు, నిమ్మరసం లేదా వెనిగర్ వంటి ఆమ్ల పదార్థం, కొద్దిపాటి సహనం ఉంటే సరిపోతుంది. అయితే, పనీర్ గట్టిగా లేదా రబ్బరీగా మారడానికి కారణం తయారీ విధానంలో జరిగే చిన్న తప్పిదాలే అని చాలా మందికి తెలియదు. ఉష్ణోగ్రత నియంత్రణ, కర్డ్స్‌ను ఎలా హ్యాండిల్ చేయాలి, ఎంతసేపు ప్రెస్ చేయాలి వంటి అంశాలు చివరి ఫలితంపై ప్రభావం చూపుతాయి. పనీర్ రబ్బరీగా మారడానికి ప్రధాన కారణాల్లో మొదటిది పాలను ఎక్కువ వేడి చేయడం. పాలను ఎక్కువ మంటపై మరిగిస్తే, అందులోని ప్రోటీన్లు త్వరగా గట్టిపడతాయి. దీనివల్ల కర్డ్స్ గట్టిగా మారి, తేమ తగ్గి, చివరికి పనీర్ గట్టిగా తయారవుతుంది. అందుకే పాలను మోస్తరు మంటపై మరిగించి, ఆమ్ల పదార్థం కలిపే ముందు మంట తగ్గించాలి. కర్డ్స్ ఏర్పడిన వెంటనే మంట ఆపడం ఉత్తమం.

**ఆమ్ల పదార్థం ఎక్కువగా వద్దు..**

రెండో కారణం ఆమ్ల పదార్థాన్ని ఎక్కువగా ఉపయోగించడం. నిమ్మరసం లేదా వెనిగర్ ఎక్కువగా వేస్తే కర్డ్స్ చాలా గట్టిగా మారి, పనీర్ కొంచెం పుల్లగా కూడా అనిపిస్తుంది. సాధారణంగా ఒక లీటర్ పాలకు 1 నుండి 2 టేబుల్ స్పూన్లు సరిపోతాయి. నీరు పచ్చగా మారిన వెంటనే ఆపాలి. మూడో కారణం పనీర్‌ను ఎక్కువగా ప్రెస్ చేయడం. కర్డ్స్‌ను గట్టిగా లేదా ఎక్కువసేపు నొక్కితే అందులోని తేమ పూర్తిగా బయటకు వెళ్లిపోతుంది. దీంతో పనీర్ గట్టిగా, రబ్బరీగా మారుతుంది. సాధారణంగా 20 నుండి 30 నిమిషాల పాటు తక్కువ బరువుతో ప్రెస్ చేస్తే సరిపోతుంది. నాలుగో ముఖ్యమైన అంశం కూలింగ్ ప్రాసెస్‌ను నిర్లక్ష్యం చేయడం. చాలా మంది కర్డ్స్‌ను చల్లని నీటితో కడగడం మానేస్తారు. కానీ ఈ దశ చాలా కీలకం. ఇది కర్డ్స్‌ను మరింతగా ఉడికిపోకుండా ఆపడంతో పాటు, అదనపు ఆమ్లత్వాన్ని తొలగించి పనీర్‌ను మృదువుగా ఉంచుతుంది. కాబట్టి కర్డ్స్‌ను మస్లిన్ క్లాత్‌లో వడకట్టి చల్లని నీటితో కడగాలి.

సరైన పాలను వాడకపోవడం..ఐదో కారణం సరైన పాలను ఉపయోగించకపోవడం. ఫుల్ ఫ్యాట్ పాలు పనీర్ తయారీకి ఉత్తమం. టోన్డ్ లేదా స్కిమ్డ్ మిల్క్ వాడితే పనీర్ గట్టిగా తయారవుతుంది. తాజా, అధిక కొవ్వు ఉన్న పాలు వాడితేనే మృదువైన, క్రీమీ పనీర్ లభిస్తుంది. మృదువైన పనీర్ తయారుచేయాలంటే కొన్ని ముఖ్య సూచనలు పాటించాలి. తాజా ఫుల్ ఫ్యాట్ పాలు ఉపయోగించడం, ఆమ్ల పదార్థాన్ని నెమ్మదిగా కలపడం, కర్డ్స్ ఏర్పడిన వెంటనే మంట ఆపడం, చల్లని నీటితో కడగడం, తక్కువ బరువుతో ప్రెస్ చేయడం వంటి చిన్న జాగ్రత్తలు తీసుకుంటే పనీర్ అద్భుతంగా తయారవుతుంది. సరైన విధానం తెలిసిన తర్వాత ఇంట్లో పనీర్ తయారీ చాలా సులభంగా మారుతుంది. పనీర్ భుర్జీ నుండి గ్రేవీ వంటకాల వరకు అన్ని వంటల్లో మృదువైన పనీర్ రుచిని మరింత పెంచుతుంది.

# రోజూ 24 నిమిషాల పాటు ఇష్టమైన సంగీతం వింటే మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు


సాధారణంగా సంగీతం వినడం మనసుకు శాంతినిస్తుందని అందరికీ తెలిసిందే. కానీ కేవలం 24 నిమిషాల పాటు ప్రత్యేకంగా రూపొందించిన సంగీతాన్ని వినడం ద్వారా ఆందోళన (ఆంగ్జయిటీ)ను గణనీయంగా తగ్గించవచ్చని తాజా క్లినికల్ ట్రయల్ వెల్లడించింది. ఔషధాలు లేకుండానే ఒత్తిడిని నియంత్రించేందుకు ఇది సులభమైన మార్గమని పరిశోధకులు చెబుతున్నారు. కెనడాలోని టొరొంటో మెట్రోపాలిటన్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు నిర్వహించిన ఈ పరిశోధనలో, సంగీతాన్ని ఆడిటరీ బీట్ స్టిమ్యులేషన్ (ూదీూ) అనే పద్ధతితో కలిపి ఉపయోగించారు. ఇందులో ప్రతి చెవికి కొంచెం భిన్నమైన శబ్ద తరంగాలను వినిపించడం ద్వారా మెదడు ఒక రిథమ్‌ను సృష్టిస్తుంది. ఈ రిథమ్ మెదడు తరంగాలను ప్రభావితం చేసి, విశ్రాంతి, ఏకాగ్రత లేదా నిద్రకు అనుకూలమైన స్థితిని కలిగిస్తుంది.

**24 నిమిషాలే ఎందుకు..?**

పరిశోధనలో భాగంగా పాల్గొన్న వారికి వివిధ సమయాల పాటు ప్రత్యేకంగా రూపొందించిన ఆడియోలను వినిపించారు. ఈ పరీక్షల్లో 24 నిమిషాల వినికిడి సమయం అత్యుత్తమ ఫలితాలను ఇచ్చిందని తేలింది. ఈ వ్యవధి తరువాత పాల్గొన్నవారు తాము మరింత ప్రశాంతంగా, ఒత్తిడి తగ్గినట్లుగా, భావోద్వేగంగా సమతుల్యంగా ఉన్నట్లు తెలిపారు. ఈ అధ్యయనంలో మరో ముఖ్యమైన విషయం స్వీట్ స్పాట్ భావన. తక్కువ సమయం సంగీతం విన్నప్పటికీ కొంత ప్రయోజనం కనిపించినా, అది ఎక్కువగా లేదు. అదే విధంగా, చాలా ఎక్కువసేపు వినడం కూడా అదనపు ప్రయోజనాన్ని ఇవ్వలేదు. కాబట్టి 24 నిమిషాలు అత్యంత సమర్థవంతమైన సమయంగా గుర్తించారు. ఆందోళన ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఒక ప్రధాన మానసిక ఆరోగ్య సమస్య. దీనికి ప్రత్యామ్నాయంగా ఔషధాలు కాకుండా ఇతర మార్గాలను అన్వేషిస్తున్న వారికి ఈ విధానం ఉపయోగపడుతుంది. సంగీత ఆధారిత చికిత్సల ముఖ్య ప్రయోజనాలు ఏమిటంటే ఇవి సులభంగా అందుబాటులో ఉండటం, తక్కువ ఖర్చుతో ఉండటం, రోజువారీ జీవితంలో సులభంగా అమలు చేయగలగటం.

**మానసిక ఆరోగ్యానికి మేలైన పద్ధతి..**

సంగీతం మెదడుపై ఎలా పనిచేస్తుందనే విషయంలో కూడా శాస్త్రవేత్తలు కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సంగీతం వినడం ద్వారా ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసోల్ స్థాయిలు తగ్గుతాయి. ఆనందం, రివార్డ్‌కు సంబంధించిన మెదడు భాగాలు ఉత్తేజితమవుతాయి. అలాగే గుండె వేగం, శ్వాస నియంత్రణలోకి వస్తాయి. ూదీూ వంటి పద్ధతులతో కలిపినప్పుడు ఈ ప్రభావం మరింత పెరుగుతుంది. అయితే ఈ పరిశోధనకు కొన్ని పరిమితులు కూడా



ఉన్నాయి. ఇది తక్కువ కాల ప్రభావాలపై మాత్రమే దృష్టి పెట్టింది. దీర్ఘకాలంలో ఈ ప్రయోజనాలు కొనసాగుతాయా లేదా అనేది ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. అంతేకాకుండా, ప్రతి వ్యక్తి సంగీతానికి భిన్నంగా స్పందిస్తాడు కాబట్టి, అందరికీ ఒకే విధంగా ఫలితాలు రావని పరిశోధకులు చెబుతున్నారు. ఒత్తిడి లేదా ఆందోళనగా అనిపించినప్పుడు రోజుకు 20 నుంచి 30 నిమిషాలు ప్రశాంతమైన సంగీతాన్ని వినడం ఒక సులభమైన, ప్రమాదరహిత మార్గంగా ఉపయోగపడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇది తీవ్రమైన సమస్యలకు పూర్తి పరిష్కారం కాకపోయినా, మైండ్‌ఫుల్‌నెస్, వ్యాయామం, థెరపీ వంటి ఇతర పద్ధతులతో కలిపి ఉపయోగిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.




మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరమని అందరికీ తెలిసిందే. కాలేయ సమస్యలు, గుండె వ్యాధులు, వ్యసనం వంటి అనేక సమస్యలకు ఇది కారణమవుతుంది. అయితే తాజా పరిశోధన ప్రకారం యుక్త వయస్సులో ఒత్తిడిని తగ్గించుకోవడానికి మద్యం సేవించడం మధ్య వయస్సులో మెదడు పనితీరుపై తీవ్ర ప్రభావం చూపవచ్చని వెల్లడైంది. అల్కహాల్ క్లినికల్ అండ్ ఎక్స్‌పెరిమెంటల్ రీసెర్చ్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనాన్ని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ అంహెర్స్ట్ పరిశోధకులు నిర్వహించారు. దీని ప్రకారం యువ దశలో ఒత్తిడి కారణంగా మద్యం సేవించిన వారు, తరువాత కాలంలో పూర్తిగా మానేసినా కూడా మెదడు పనితీరులో మార్పులు కొనసాగుతాయని తేలింది.

**దీర్ఘకాలంలో మెదడుపై ప్రభావం..**

ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన బయాలజీ ప్రొఫెసర్ ఎలీనా వాజీ మాట్లాడుతూ మద్యం, ఒత్తిడి కలిసి మెదడులో నిర్ణయాలు తీసుకునే విధానాన్ని ప్రభావితం చేస్తాయని తెలిపారు. ముఖ్యంగా యువ దశలో మెదడు ఇంకా అభివృద్ధి చెందుతున్న సమయంలో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు పేర్కొన్నారు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి చాలామంది మద్యం సేవిస్తారు. తాత్కాలికంగా ఇది ఉపశమనాన్ని ఇస్తుంది. అయితే దీర్ఘకాలంలో మెదడు సహజంగా ఒత్తిడిని నియంత్రించే సామర్థ్యాన్ని ఇది దెబ్బతీస్తుంది. ఫలితంగా ఒక దుష్చక్రంగా ఏర్పడుతుందని, ఎక్కువగా మద్యం సేవించడం, దానివల్ల తప్పు నిర్ణయాలు తీసుకోవడం, మరింత ఒత్తిడి పెరగడం, మళ్లీ మద్యం వైపు మళ్లడం వంటివి జరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.

**ఎలుకలపై ప్రయోగాలు..**

ఈ అధ్యయనంలో ఎలుకలపై ప్రయోగాలు చేశారు. యువ దశలో వాటికి అధిక మద్యం, దీర్ఘకాలిక ఒత్తిడిని కలిపి ఇచ్చి, తరువాత కొన్ని నెలల పాటు మద్యం పూర్తిగా నిలిపివేశారు. అయినప్పటికీ మధ్య వయస్సుకు సమానమైన దశలో ఆ ఎలుకలు కొత్త పరిస్థితులకు తగినట్లు ఆలోచించడంలో ఇబ్బంది పడ్డాయి. అంటే కాగ్నిటివ్ ఫ్లెక్సిబిలిటీ తగ్గిపోయింది. ఈ ప్రభావాలకు ప్రధాన కారణం మెదడులోని లోకస్ కోరూలియస్ అనే భాగంలో వచ్చిన మార్పులు. సాధారణంగా ఇది ఒత్తిడిలో పనిచేసి తరువాత ప్రశాంత స్థితికి వస్తుంది. కానీ మద్యం, ఒత్తిడి ప్రభావంతో ఇది ఎప్పుడూ అధికంగా పనిచేస్తూ ఉంటుంది. దీంతో నిర్ణయాలు తీసుకోవడంలో, పరిస్థితులకు అనుగుణంగా మారడంలో సమస్యలు వస్తాయి.

**ప్రత్యేక చికిత్సలు అవసరం..**

ఇంకా ఈ పరిస్థితిలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ అనే సెల్ స్థాయి నష్టం కూడా పెరుగుతుంది. ఇది అల్జీమర్స్ వంటి వ్యాధులతో సంబంధం ఉన్న ఒక సూచిక. దీని వల్ల మెదడు కోలుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. అంతేకాకుండా ఇంతకు ముందు మద్యం ఎక్కువగా తీసుకున్న వారు మళ్లీ ఒత్తిడిలో పడినప్పుడు మద్యం వైపు తిరిగి వెళ్లే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు తెలిపారు. మధ్య వయస్సులో జీవన ఒత్తిడులు పెరిగే సమయంలో, ఈ ప్రభావాలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. కొత్త పరిస్థితులకు తక్షణంగా స్పందించలేకపోవడం, ఆలోచనా సామర్థ్యం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి డిమెన్షియా ప్రారంభ దశలకు దగ్గరగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఎన్టీఆర్--ప్రశాంత్ నీల్ 'డ్రాగన్'పై పెరుగుతున్న హైప్.. విలన్‌గా బాలీవుడ్ హీరో

పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న డ్రాగన్ సినిమా రోజురోజుకు వార్తల్లో నిలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ , ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ క్రేజ్‌ను సంపాదించింది. 'ఆర్ఆర్ఆర్', 'దేవర' వంటి వరుస విజయాల తర్వాత ఎన్టీఆర్ నటిస్తున్న సినిమా కావడం, 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించడం ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను మరింత పెంచుతోంది.

అయితే, గత కొన్ని రోజులుగా ఈ సినిమాకు సంబంధించి షూటింగ్, నటీనటుల ఎంపికపై సోషల్ మీడియాలో అనేక రూమర్స్ వినిపిస్తున్నాయి.




ఈ సినిమాలో హీరోతో సమానంగా పవర్‌ఫుల్ విలన్ పాత్ర ఉంటుందని ఇప్పటికే టాక్. తొలుత మలయాళ స్టార్ టోవినో థామస్ ను నెగటివ్ రోల్ కోసం సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. కానీ డేట్స్ సమస్యల కారణంగా ఆయన ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ఇప్పుడు ఈ కీలక పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఎన్టీఆర్‌కు ధీటుగా నిలిచే విలన్‌గా ఆయనను ఎంపిక చేయాలని మేకర్స్ భావిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే చర్చలు జరిగాయని, త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని టాక్ నడుస్తోంది.

ఇక షూటింగ్ ఆగిపోయిందంటూ వచ్చిన వార్తలను చిత్ర బృందం ఖండించింది. ఎన్టీఆర్ లుక్ విషయంలో డైరెక్టర్‌తో విభేదాలు వచ్చాయని ప్రచారం జరిగినా, అందులో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేసింది. తీసుకోవడం సాధారణమేనని, ప్రస్తుతం షూటింగ్ ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగుతోందని తెలిపింది.

# బాలకృష్ణ, గోపీచంద్ కాంబో

నటసింహం నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే అనౌన్స్‌మెంట్‌తోనే హైప్ క్రియేట్ చేసిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు మ్యూజిక్ పనులతో మరో అడుగు వేసింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభించారు. తాజా సమాచారం ప్రకారం, రెండు ట్యూన్స్‌ను పూర్తిచేసిన థమన్, వాటిలో ఒక సాంగ్‌కి ప్రముఖ లిరిసిస్ట్ అనంత్ శ్రీరామ్‌తో పాట రాయించినట్టు తెలుస్తుంది. ఈ సాంగ్‌ను హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో గ్రాండ్‌గా చిత్రీకరించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ సాంగ్ షూట్ పూర్తయ్యిన వెంటనే అక్కడే ఒక కీలక యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా చిత్రీకరించనున్నట్లు సమాచారం. భారీ సెట్స్, విజువల్ గ్రాండియర్‌తో ఈ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో బాలకృష్ణను ఒక రాజుగా చూపించగా, హీరోయిన్‌గా నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో ఇది ఒక పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే బాలయ్య?నయనతార కాంబినేషన్ ప్రేక్షకులను పలుమార్లు మెప్పించింది.





వీరిద్దరూ కలిసి నటించిన సింహా, శ్రీరామ రాజ్యం, జై సింహా చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు మరోసారి ఈ జోడీ తెరపై కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మాత సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం కథ, సెట్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేకంగా ఉండబోతున్నాయని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి, బాలయ్య-గోపీచంద్ మలినేని కాంబోలో వస్తున్న ఈ పీరియాడిక్ మూవీపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతుండగా, త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి.

# రణబాలి సెట్స్‌లోకి అడుగుపెట్టిన

## విజయ్ దేవరకొండ, రష్మిక

'రణబాలి' చిత్రంతో జంటగా ప్రేక్షకుల్ని అలరించనున్నారు విజయ్ దేవరకొండ - రష్మిక. వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న ఈ సినిమాని రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కోసం విజయ్ - రష్మిక తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టారు. ఈ ఇద్దరూ వైవాహిక బంధంలోకి అడుగు పెట్టాక కలిసి సెట్‌లోకి రావడం ఇదే తొలిసారి కావడంతో చిత్ర బృందం వారికి స్వాగతం పలికి.. కేక్ కట్ చేయించింది. 1854 - 1978 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నారు. విజయ్ దీంట్లో టైటిల్ పాత్ర పోషిస్తుండగా..





ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక నటిస్తోంది. ఈ సినిమా సెప్టెంబరు 11న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ - అతుల్, ఛాయాగ్రహణం: నీరవ్ షా.

# భరతవర్ష్ మూవీతో వస్తోన్న గోపీచంద్

యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస ఫ్లాప్స్ తర్వాత సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో కొత్త సినిమాను ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక సినిమా పై ఒక్కసారిగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే టైటిల్‌కు కూడా ప్రత్యేకమైన అర్థం ఉంది. పురాణాల ప్రకారం భరతవర్షం అంటే హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతదేశాన్ని సూచిస్తుంది. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో సినిమా దేశభక్తి, చరిత్ర, మైథాలజీ అంశాలను మేళవించి రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఇండిపెండెన్స్‌కు ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథలో మైథాలజీ టచ్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా




మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందట. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని తెలుస్తోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది ఒక టర్నింగ్ పాయింట్ మూవీ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, టైటిల్ ప్రభావం చూస్తే 'భరతవర్ష'తో ఆయన బలమైన కంబ్యాక్ ఇవ్వడం ఖాయం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.





# కండలు పెంచి..కొత్త లుక్‌లో ఎన్టీఆర్

## డ్రాగన్ కోసం ఎన్టీఆర్ కసరత్తులు

జూనియర్ ఎన్టీఆర్ , స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న డ్రాగన్‌పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ న్యూ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. తాజాగా బయటకు వచ్చిన లుక్‌లో ఎన్టీఆర్ కండలు తిరిగిన దేహంతో, బీస్ట్ మోడ్‌లో కనిపిస్తున్నారు. సన్నని నడుముతో క్లాసిక్ బ్యాక్ డబుల్ బైసెప్స్ పోజ్‌లో ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవర్‌ఫుల్ యాక్షన్ పాత్ర కోసం ఎన్టీఆర్ కఠినమైన ట్రైనింగ్, ప్రత్యేక డైట్‌ను ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న ఫోటోను షేర్ చేస్తూ ఇది కష్టపడి తెచ్చుకున్న కండలు..కొన్నవి కావు.. అని ఆయన రాసిన క్యాప్షన్ కూడా వైరల్ అవుతోంది. ఇటీవల ఎన్టీఆర్ లుక్‌పై కొంత అసంతృప్తి ఏర్పడిందని, దాని వలన షూటింగ్ నిలిచిపోయిందంటూ ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే దీనిపై చిత్ర నిర్మాతలు స్పష్టత ఇచ్చారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇది కేవలం రెగ్యులర్ షెడ్యూల్ బ్రేక్ మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ అనుకున్న ప్రణాళిక ప్రకారమే కొనసాగుతోందని పేర్కొన్నారు.

Edited, Printed, Published and Owned By DOCTOR.VAKKALA VENKATA SWAMY , and Printed at VVRSUK GRAPHICS OFFSET PROCESS AND PRINTERS, H.No. 1-9-208, Julywada, Hanamkonda, Dist. Warangal Urban - 506001, Telangana., and Published at H.No. 1-9-208, Julywada, Hanamkonda, Dist. Warangal Urban - 506001, Telangana. Editor: DOCTOR.VAKKALA VENKATA SWAMY, RNI.No. TELTEL/2021/80389, Cell No.9502203214 , E-mail Id :vvrsuk18@gmail.com.